ఈనాడు
అమరావతి
గుంటూరు
గురువారం సెప్టెంబరు 26, 2024

నిబంధనలను అంబటి ఉల్లంఘించారా?

గ్రీన్ గ్రీస్ భవన నిర్మాణాలపై రైల్వే, జీఎంసీ అధికారుల పరిశీలన


బహుళ అంతస్తుల భవనం నుంచి రైల్వే ట్రాక్ వరకు ఎంత దూరం ఉందో.. కొలతలు తీస్తున్న అధికారుల బృందం

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు నగరంలోని పట్టాభిపురం రైల్వే ట్రాకుకు సమీపంలో వైకాపా నాయకుడు అంబటి మురళీకృష్ణ నిర్మిస్తున్న గ్రీన్ గ్రీస్ బహుళ అంతస్తుల భవనాలను బుధవారం రైల్వే, జీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు పరిశీలించారు. అనుమతి తీసుకున్న ప్లాన్ ప్రకారమే నిర్మిస్తున్నారా? రైల్వే ట్రాక్ నుంచి నిర్దేశించిన దూరం వదిలి నిర్మిస్తున్నారా? లేదా? తదితర అంశాలను సర్వే పరికరాలతో పరిశీలించారు. భవన నిర్మాణం కోసం తీసుకున్న ప్లాన్‌ను అతిక్రమించినట్టు జీఎంసీ అధికారులు గతంలోనే గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించినట్టు తేల్చిన రైల్వే శాఖ గతంలోనే నిరభ్యంతర ధ్రువపత్రాన్ని రద్దు చేసింది. ఇతర ఉల్లంఘనలూ ఉన్నాయని ఇటీవల తెదేపా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఇటీవల జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు భవన నిర్మాణాలను పరిశీలించి.. మరోమారు ఎన్‌వోసీ ప్రకారం నిర్మాణాలు ఉన్నాయో.. లేవో తేల్చాలని రైల్వే అధికారులను కోరారు. దీంతో బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించి వివరాలు నమోదు చేశారు. ఎంతమేర ఉల్లంఘనలు ఉన్నాయో అధికారులు వెల్లడించలేదు. తనిఖీల్లో రైల్వే శాఖ అధికారులతోపాటు నగరపాలకసంస్థ పట్టణ ప్రణాళిక సిటీ ప్లానర్ రాంబాబు, డిప్యూటీ సిటిప్లానర్ మహాపాత్రో, ఏసీపీ మురళీ, టీపీఎస్ రిజ్వానా తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న.. తోడున్నారు

15 రోజుల్లోపే పరిహారం అందజేత
వరద బాధితుల హర్షాతిరేకాలు.

ఈనాడు డిజిటల్ – అమరావతి


ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా పరిహార పత్రాలు అందుకుంటున్న శివరామయ్య, మధుశేఖర్

ఇటీవల వర్షాలు, వరదలతో ఇళ్లు, పంటలు, వాహనాలు, దుకాణాలు, వ్యాపార సముదాయాలు, గృహోపకరణాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. నష్టపోయిన ప్రతీ బాధితుడికి సాయం అందిస్తామని కొద్ది రోజుల కిందటే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ముంపు ప్రాంతాల్లో ఒక పక్క సహాయక కార్యక్రమాలు నిర్వహిస్తూ.. మరోవైపు ప్రత్యేక బృందాల ద్వారా నష్టాన్ని అంచనా వేయించారు. బుధవారం ఎన్టీఆర్ కలెక్టరేట్‌లో వరద బాధితులకు పరిహారాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా కొంత మంది బాధితులకు సీఎం చంద్రబాబు ఆర్థిక సహాయం అందించే లేఖలు అందించారు. బాధితులు మాట్లాడుతూ.. వరద తగ్గిన 15 రోజుల్లోపే పరిహారాన్ని ఇంత వరకు ఏ ముఖ్యమంత్రీ ఇవ్వలేదన్నారు. ఎన్నడూలేని ఆర్థిక సహాయాన్ని అందించారని సీఎం చంద్రబాబుని కొనియాడారు. వారి భావాలను ఇలా పంచుకున్నారు.

పరిహారంతో మళ్లీ పనులు మొదలెడతాం

– తుమ్మలచర్ల కుమారి, చేనేత కార్మికురాలు, మంగళగిరి

మా కుటుంబానికి వస్త్రాలు నేయడమే జీవనాధారం. ఇటీవల వచ్చిన వరదలకు మా ఇల్లు మొత్తం తడిసి ముద్దయ్యింది. నేత వేసే పరికరాలు, వస్త్రాలన్నీ తడిశాయి. దానిని బాగు చేసుకునేందుకు ఇంకా నెల రోజులు పడుతుంది. వరదల వేళ మా ప్రాంతానికి లోకేశ్ వచ్చి రోజంతా నీటిలో తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. 15 రోజుల లోపే పరిహారం అందడం సంతోషంగా ఉంది. పరిహారంతో మళ్లీ మగ్గం పనులు మొదలెడతాం. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

ఇంత త్వరగా పరిహారం ఏ సీఎం ఇవ్వలేదు

– శివరామయ్య, రైతు, వడ్లపూడి

నేను ఐదెకరాలు వరి వేశాను. మొత్తం మునిగిపోయింది. ఇంతకు ముందు మేం నష్టపరిహారానికి దరఖాస్తు చేసుకుంటే ఎప్పటికో వచ్చేది. అది కూడా ఎకరానికి రూ.ఏడు వేలు మాత్రమే ఇచ్చేవారు. ఎన్నడూ లేని విధంగా... ఇంత త్వరగా ఎకరానికి రూ.25 వేలు అందించారు. రైతాంగానికి ఈ పరిహారం ఎంతో ఉపయోగం కలుగుతుంది.

తొలిసారి కౌలురైతుగా సాయం పొందుతున్నా..

– మధుశేఖర్, కౌలు రైతు, చిర్రావూరు, తాడేపల్లి మండలం

మూడున్నర ఎకరాలకు పైగా కౌలు చేస్తున్నాను. అందులో అరటి, పసుపు, సొరకాయ వేశాను. పెట్టుబడి అంతా వరదకు కొట్టుకుపోయింది. ఇప్పటి వరకు కౌలు రైతుగా ఎప్పుడూ పరిహారం అందలేదు. మొదటిసారి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా పరిహారం అందుకుంటున్నాను. సంతోషంగా ఉంది.

హానికారం

మిర్చి తొడిమలు.. తుక్కు కాయలు.. తాలుకాయలు.. వర్షానికి తడిసి రంగు మారి.. చీడపీడలతో దెబ్బతిన్న మిరపకాయలు.. వీటన్నింటినీ పొడిగా చేసి.. రంగులు జోడించి... సంచుల్లో నింపి... మార్కెట్‌లోకి తెస్తున్నారు... నాసిగా ఉండే కల్తీ కారం..

మెరిసేదంతా బంగారం కాదన్నట్టు... ఎర్రగా ఉన్నంత మాత్రాన అది అసలైన కారమే కాదు. ఆసియాలోనే పెద్దదైన గుంటూరు మిర్చియార్డు పరిసర ప్రాంతాల్లోని కొన్ని మిల్లుల్లో హానికర రసాయనాలు, రంగులతో తయారవుతోంది కల్తీ కారం.


పట్నంబజార్‌లో తయారీ వివరాలు లేకుండా విక్రయిస్తున్న నాసిరకం కారం

ఈనాడు – అమరావతి

- నాసిరకం కాయలతో తయారీ
- రసాయనాలతో కృత్రిమ రంగుల వాడకం
- చాపకింద నీరులా కల్తీ విక్రయాలు

రకరకాల పేర్లతో రోజువారీ గిరాకీ ఉండే అల్పాహారశాలలు, మాంసాహార దుకాణాలు, హోటళ్లు, క్యాటరింగ్ పనులు చేసే కొంతమందికి అతి తక్కువ ధరకే అంటగడుతున్నారు. గుంటూరు కారానికి ఉన్న డిమాండ్‌ను ఉపయోగించుకుని ఈ అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.

తయారీ ఖర్చుకంటే తక్కువకే....

పది కిలోల కారం కావాలంటే 12 నుంచి 12.50 కిలోల మిర్చిని మర పట్టించాలి. సగటున కిలో మిరపకాయల ధర రూ. 170 అనుకుంటే.. తొడిమలు, ఇతరత్రా వ్యర్థాలు పోగా కిలో కారం తయారీకి రూ. 220 వరకు ఖర్చవుతుంది. ప్యాకింగ్, రవాణా ఇతర ఖర్చులు, లాభం కలిపి కనీసం మరో రూ. 30 వేసుకున్నా. . కిలో రూ. 250కిపైగానే విక్రయించాలి. ప్రముఖ కంపెనీల కారం పొడి ధరలు మార్కెట్లో రూ. 270 నుంచి రూ. 400 వరకు ఉన్నాయి. కానీ.. స్థానికంగా కొంతమంది వ్యాపారులు కిలో కారం రూ. 150 నుంచి రూ. 200కే విక్రయిస్తున్నారు. అదే 25 కిలోల కారం బస్తా కొనుగోలు చేస్తే ఇంకా తక్కువకే వస్తోంది. ఎక్కువగా లూజుగానే విక్రయిస్తున్నారు.

నాసిరకం మిర్చితో....

యంత్రాలతో మిరపకాయల తొడిమ తీస్తుంటారు. ఈ క్రమంలో తొడిమలు, మిర్చి తుక్కు, విత్తనాలతో కలిపి వృథా వస్తుంది. శీతల గోదాములు, మిర్చి యార్డులో బస్తాలు అటూఇటూ మార్చే క్రమంలో కొన్ని కాయలు కిందపడి నలిగి తుక్కుగా మారిపోతుంటాయి. వీటిని కిలో రూ. 20 నుంచి రూ. 22 పెట్టి కొనుగోలు చేస్తుంటారు. వీటితో కారం తయారు చేసి రంగులు, రసాయనాలు, పొద్దు తిరుగుడు, పామాయిల్ వంటివి కలిపి ఎర్రగా ఉండేలా చూస్తున్నారు. ఈ యూనిట్లు తుక్కు నుంచి విత్తనాలు వేరే చేసే పేరుతో నడుస్తున్నాయి. దీంతో ఎవరికీ అనుమానం రావడం లేదు.

ఎంపిక చేసుకున్న వారికే....

కల్తీ కారాన్ని మార్కెట్లో ఎంపిక చేసుకున్న వారికే బస్తాల్లో వేర్వేరు బ్రాండ్ల పేరుతో విక్రయిస్తున్నారు. తక్కువ ధరకే వస్తుండడం.. అదీ స్థానికంగానే లభిస్తుండడంతో వ్యాపారులు సైతం కొంటున్నారు. వీరు అర కిలో, కిలో, ఐదు కిలోలుగా ఆకర్షణీయంగా ప్యాకింగ్ చేసి విడిగా విక్రయిస్తున్నారు. గుంటూరు నగరంలోని ఏలూరు బజారు, పట్నం బజారు, మహాత్మాగాంధీ రోడ్డు, ఏటుకూరు రోడ్డు ప్రాంతాల్లో చిన్నచిన్న దుకాణాలకు రవాణా అవుతోంది. ఎక్కువగా పట్నంబజారు కేంద్రంగానే ఈ వ్యాపారం నడుస్తోంది. కొంతమంది రహస్య అరల్లో దాచి మరీ విక్రయిస్తున్నారు. రోజువారీ వినియోగం ఎక్కువగా ఉన్నవారు అడిగి మరీ కొంటున్నారని ఓ వ్యాపారి చెప్పడం గమనార్హం.

జీర్ణవ్యవస్థపై తీవ్ర ప్రభావం

కృత్రిమ రంగులు, రసాయనాలతో కల్తీ అయిన కారంతో చేసిన ఆహారం తీసుకుంటే జీర్ణ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. ఈ రసాయనాలు చాలా ప్రమాదకరం. దీర్ఘకాలంలో అల్సర్లతో పాటు కాలేయం దెబ్బతినే ప్రమాదం ఉంది. అన్నవాహిక, జీర్ణాశయంలో పూతలు వచ్చి పుండ్లు పడొచ్చు. కొన్నాళ్లపాటు కల్తీకారం వాడితే క్యాన్సర్‌కూ దారి తీయొచ్చు. చర్మవ్యాధులు వస్తాయి. నరాల వ్యవస్థపైనా ప్రభావం పడుతుంది.

– డాక్టర్ దేవినేని సుధీర్‌బాబు, ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, జీజీహెచ్ గుంటూరు

ఎవరి కోసం దుబారా?

ఈనాడు – అమరావతి

వర్సిటీలో బాగోతం


హెల్త్ సెంటర్‌లో వినియోగిస్తున్న అంబులెన్స్

అత్యవసర వైద్యం అవసరమైనప్పుడు వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లడానికి అంబులెన్స్ అవసరమే. కానీ.. ఈ పేరుతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిధులు దారి మళ్లుతున్నాయి. వర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులకు ప్రాథమిక వైద్యం అందించడానికి క్యాంపస్‌లోనే ఒక ఆరోగ్య ఉపకేంద్రం నడుస్తోంది. ఇద్దరు వైద్యులు, పదిమందికిపైగా పారామెడికల్ ఉద్యోగులు ఉన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో వర్సిటీ కీలక అధికారి ఒకరు అవసరం లేకపోయినా తన బంధువులకు చెందిన వాహనాన్ని రెండో అంబులెన్స్‌గా తీసుకొచ్చారు. ఇలా మూడేళ్ల నుంచి అద్దె చెల్లిస్తున్నారు. అంబులెన్స్‌ల కోసమని ముగ్గురు, నలుగురు డ్రైవర్లను నియమించి వారికి జీతభత్యాలు చెల్లిస్తున్నారు.

☛ వర్సిటీలో విద్యార్థులు, ఉద్యోగులు కలిపి దాదాపుగా 4 వేల మంది వరకు ఉంటారు. ఆరోగ్య ఉపకేంద్ర అధికారులు మాత్రం 8 వేల మంది వరకు ఉన్నారని లెక్క చెబుతున్నారు. నిత్యం ఓపీకి 70 మంది వస్తున్నారని కాకి లెక్కలేస్తున్నారు. ఈ కేంద్రంలో ఎవరూ అందుబాటులో ఉండడం లేదని వర్సిటీ ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు.

☛ వర్సిటీకి సమీపంలోనే ఉన్న ఎన్నారై ఆసుపత్రితో ఎంఓయూ ఉంది. మరోవైపు 20 కిలోమీటర్ల దూరంలో గుంటూరు ప్రభుత్వ బోధనాసుపత్రి ఉంది.

ఉద్యోగుల రాకపోకల కోసమా...

విద్యార్థులకు అత్యవసర వైద్య పరిస్థితులు ఏర్పడితే వెంటనే అంబులెన్స్ పంపాలి. అందుకు భిన్నంగా ఇక్కడున్న రెండు అంబులెన్స్‌లు చాలావరకు ఉద్యోగులను ఇళ్ల నుంచి ఆసుపత్రికి, ఆసుపత్రి నుంచి ఇళ్లకు తీసుకెళ్లడానికి ఉపయోగిస్తున్నారు. ఓ వైద్యుడైతే నిత్యం తన రాకపోకలన్నింటికీ ఒక అంబులెన్స్‌ను వాడుతున్నారు. వీటికి పెద్దమొత్తంలో నెలవారీ ఇంధన ఖర్చులు రాస్తున్నారు. ఒక్కో వాహనానికి నెలకు రూ. 40 వేలకుపైగానే అద్దె చెల్లిస్తున్నారు. డ్రైవర్లకు నెలకు రూ. 50 వేలకుపైగా చెల్లిస్తున్నట్టు తెలిసింది..

☛ వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలాన్ని వివరణ కోరగా ఆరోగ్య కేంద్రం పనితీరు.. అంబులెన్స్‌లు. వాటికవుతున్న వ్యయాలపై ఇటీవల ఆరా తీశామని చెప్పారు. ఖర్చు కొంచెం ఎక్కువగానే ఉందన్నారు. అంబులెన్స్‌కు చెల్లించే అద్దెతో ఇప్పటికే కొత్తది కొనుగోలు చేయొచ్చన్నారు. దీనిపై ఇంజినీరింగ్ విభాగాన్ని నివేదిక కోరామని తెలిపారు.

అడుగేస్తే మురుగులోకే!


బృందావన్‌గార్డెన్స్ కూడలిలో నిలిచిన మురుగునీరు

ఇవేమీ మురుగు కాలువలు కాదు.. అచ్చంగా రోడ్లే. గుంటూరు నగరంలోని ప్రధాన డ్రెయిన్లన్నీ ఆక్రమణలతో పాటు వ్యర్థాలతో పూడిపోయి ముందుకెళ్లే దారి లేక మురుగంతా పొంగి రహదారుల మీదనే ప్రవహిస్తోంది. కాస్త చినుకులు పడితే చాలు అడుగు బయటకు పెట్టలేని పరిస్థితి. ఇప్పటికే ఓల్డ్ క్లబ్ రోడ్డు, మార్కెట్ ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించి పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. మిగిలినచోట్ల కూడా ఈ పనులు చేయగలిగితే మురుగు సమస్య పరిష్కారమవుతుంది.

– ఈనాడు గుంటూరు


లక్ష్మీపురం ప్రధాన రహదారిలో...


చంద్రమౌళినగర్‌లో కాలువలు నిండి ప్రధాన రహదారిపై..

ఎక్సైజ్ ఉప కమిషనర్‌గా శ్రీనివాసులు



గుంటూరు నేర వార్తలు, న్యూస్‌టుడే : ఎక్సైజ్ శాఖ గుంటూరు జోన్ ఉపకమిషనర్(డీసీ)గా కె. శ్రీనివాసులు నియమితులయ్యారు. ఇంతవరకు ఉన్న బాబ్జీ రావును విజయనగరం జోన్ ఉపకమిషనర్‌గా బదిలీ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా సహాయ కమిషనర్ రవి కుమార్‌రెడ్డిని గుంటూరు జిల్లా సహాయ కమిషనర్‌గా నియమించారు. గుంటూరు ఈఎస్ వెంకటరామిరెడ్డిని ఏపీఎస్‌బీసీఎల్ ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలన్నారు. బాపట్ల ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఉన్న అరుణకుమారిని గుంటూరు ఈఎస్‌గా నియమించారు. గుంటూరు సెబ్ ఈఎస్‌గా ఉన్న రంగారెడ్డిని ఏపీఎస్‌బీసీఎల్ ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలన్నారు.

పైరు పచ్చగా..

నియంత్రిత వాతావరణంలో సాగుకే రైతుల మొగ్గు
పెరుగుతున్న నర్సరీలు

ఈనాడు – అమరావతి


షేడ్‌నెట్‌లో పెంచిన కాకర మొక్క

ఆగస్టులో 35 డిగ్రీలకుపైగానే ఉష్ణోగ్రతలు.. వేసవిని తలపించేలా పొడి వాతావరణం. ఒక్క రోజు వ్యవధిలోనే 25 సెంటీమీటర్ల వర్షపాతం.. ఇలా భిన్న పరిస్థితుల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఈ అనూహ్య మార్పులను ఎదిగిన పంటలు తట్టుకోలేకపోతున్నాయి. విత్తనాలు మొలకెత్తే దశలో వాతావరణ అసమతుల్యం వల్ల మొలక సమస్య తీవ్రమవుతోంది. మళ్లీ దుక్కులు చేసి కొత్తగా విత్తనాలు నాటాల్సి వస్తోంది. ఇందుకు నెల రోజుల సమయం పడుతోంది. దీనివల్ల రైతులపై పెట్టుబడుల భారం పెరిగిపోతోంది. తెగించి.. అధిక ధరలకు విత్తనాలను కొనుగోలు చేసి ఆరుబయట నారుమడిలో పెంచినా.. ఎద పెట్టినా.. మొలక సమస్యలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయంగా రక్షిత నారుమడులు (షేడ్‌నెట్) ద్వారా నారు పెంచి పొలంలో నాటుకునే విధానంపై ఆసక్తి పెంచుకుంటున్నారు.

కాకర నుంచి బ్రకోలి వరకు.....

మిరప, టమాటా, వంగ, బంతి, చామంతి వంటి నారును నర్సరీల్లోని షేడ్‌నెట్‌లో పెంచుతుంటారు. తాజాగా ఈ జాబితాలోకి కాకర, చిక్కుడు, బ్రకోలి చేరాయి. షేడ్‌నెట్‌లో 15 రోజులు పెంచిన తరువాత నారును పొలంలో నాటుతున్నారు. నియంత్రిత ఉష్ణోగ్రతల వల్ల షేడ్‌నెట్లలో నారు పెంచి పొలంలో నాటడం వల్ల సకాలంలో పంటల సాగుకు అవకాశమేర్పడుతోంది. ప్రస్తుతం సంకర కాకర విత్తనం ఖరీదు రూ. 2కుపైగా ఉంటోంది.


షేడ్‌నెట్‌లో పెంచుతున్న కాకర నారు

విత్తనాల సంఖ్యను బట్టి ధర

కొన్నాళ్ల క్రితం వరకు విత్తనాలను గ్రాములు, కిలోల చొప్పున విక్రయించేవారు. కొన్ని రకాల వాణిజ్య పంటలకు సంబంధించి ప్రస్తుతం విత్తనాల సంఖ్యతో మార్కెటింగ్ చేస్తున్నారు. ఒక విత్తన సంచిలో వెయ్యి, 1,500 విత్తనాలుంటున్నాయి. ఒక్కో విత్తనం ఖరీదుగా మారుతోంది. ప్రస్తుతం సంకర కాకర విత్తనం ధర రూ. 2కుపైగానే ఉంది. ఒక కాకర మొక్కను 15 రోజులు పెంచినందుకు 60 నుంచి 70 పైసలు తీసుకుంటున్నారు. అయినా ప్రతికూల వాతావరణ పరిస్థితుల నుంచి బయటపడొచ్చని రైతులు నర్సరీలను ఆశ్రయిస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రస్తుతం కాకర, చిక్కుడు, బ్రకోలి మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. నారాకోడూరు, రాజుపాలెం, బొల్లాపల్లి, వినుకొండ, వెల్దుర్తి తదితర ప్రాంతాల్లో నర్సరీలు విస్తరిస్తున్నాయి. భవిష్యత్తులో మరికొన్ని పంటల మొక్కలనూ ఇందులో పెంచనున్నారు.

పల్లె దారులకు మహర్దశ

సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.13.93 కోట్ల నిధులు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే


ప్రత్తిపాడులో సీసీ రోడ్డు ప్రతిపాదిత వీధి

గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో అన్ని నియోజకవర్గాల్లోని ప్రధాన రహదారులన్నీ అధ్వానంగా మారాయి. గోతుల్లో ప్రయాణించలేక జనం నరకయాతన అనుభవించారు. ఇక గ్రామాల్లోని అంతర్గత రహదారుల పరిస్థితి చెప్పనవసరం లేదు. తమ గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించాలని పలు మార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు ప్రజలు అర్జీలు అందించినా ఫలితం లేకపోయింది. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే గ్రామీణ ప్రజలకు శుభవార్త చెప్పింది. గుంటూరు జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి 13.93 కోట్ల నిధులను మంజూరు చేసింది. మంగళగిరి, తెనాలి, పొన్నూరు, ప్రత్తిపాడు తాడికొండ నియోజకవర్గాల్లో 160 నిర్మాణాలు చేపట్టనున్నారు. ఈ మేరకు ఈ నెల 16న నిధులు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలకు బిల్లులే చెల్లించలేదు. దీంతో గుత్తేదారులు ఎక్కడి పనులక్కడే నిలిపేశారు. తర్వాత వాటన్నింటినీ ప్రభుత్వం రద్దు చేసింది.

నియోజకవర్గం	పనులు	నిధులు (రూ. కోట్లలో)
మంగళగిరి	36	3.35
తెనాలి	35	2.55
పొన్నూరు	35	2.21
ప్రత్తిపాడు	32	2.82
తాడికొండ	22	3.00

త్వరలోనే పనులు మొదలుపెడతాం..

ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. సాంకేతిక అనుమతులు కూడా పూర్తి చేశాం. జియోట్యాగింగ్ పూర్తి చేసిన వెంటనే గ్రామ పంచాయతీల ద్వారా పనులు చేపట్టాలి. ఈనెలాఖరుకు ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గాల్లో సీసీ రోడ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

– జె.రమేశ్, ఈఈ, పంచాయతీ రాజ్, గుంటూరు

నిత్యావసరాలు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో నిత్యావసర వస్తువుల కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించే వ్యాపారులపై అధికారులు చర్యలు తీసుకుంటామని జిల్లా సంయుక్త కలెక్టరు ఎ.భార్గవ్ తేజ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ వంట నూనెలపై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం పెంచడంతో కిలోకి రూ.పది నుంచి రూ.15 వరకు ధరలు పెరిగాయన్నారు. అంతకుముందే దిగుమతి చేసుకున్న నూనెలకు ధరల పెరుగుదల వర్తించదని చెప్పినా వ్యాపారులు పెంచారన్నారు. ఉల్లి కిలో ధర రూ.60 ఉండడం సామాన్యులను కలవర పెడుతుందన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని హోల్‌సేల్ డీలర్లు, ఉల్లి వ్యాపారులు సహకరించి ధరలు తగ్గించాలన్నారు. బియ్యం, కందిపప్పు మాదిరిగానే వంట నూనెలకు కూడా ప్రత్యేక కౌంటర్లు తెరుస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం సంచార వాహనాల ద్వారా ఆయా రాష్ట్రాల రాజధానుల్లో ఉల్లిపాయలు కిలో రూ.35కే విక్రయిస్తుందని, త్వరలోనే మన రాష్ట్రానికి కూడా అలాంటి సౌకర్యం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తుపాను, వరదల కారణంగా నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు లాభాపేక్షతో కాకుండా ప్రజల అవసరాలు తీర్చడానికి ప్రయత్నించాలని కోరారు. వరద ప్రాంతాల్లో దెబ్బతిన్న గ్యాస్ స్టౌలను బాగు చేయాలని గ్యాస్ కంపెనీ డీలర్లకు సూచించారు. గ్యాస్ స్టౌలు కొట్టుకపోతే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ పత్రం సమర్పిస్తే తక్కువ ధరకు కొత్త సిలిండర్లు మంజూరు చేస్తున్నామని వివరించారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, తెనాలి సబ్ కలెక్టరు సంజనా సింహా, గుంటూరు ఆర్డీవో శ్రీకర్, డీఎస్‌వో కోమలి పద్మ, మార్కెటింగ్, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, పప్పులు, వంటనూనెలు, బియం వ్యాపారుల సంఘం నాయకులు, రైతు సంఘాలు, పన్ను చెల్లింపుదారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేసీ భార్గవ్ తేజ

ఆత్మస్థైర్యానికి ఆలంబనగా..

విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేస్తున్న తితిదే

నెహ్రూనగర్ (గుంటూరు), న్యూస్‌టుడే

"ఒలింపిక్స్ పతక విజేత మనుబాకర్ తనకు భగవద్గీత అంటే ఇష్టమని విజయం సాధించిన సందర్భంలో తెలిపారు. ఏకాగ్రత కోసం, ఒత్తిడిని అధిగమించడానికి తాను తరచూ భగవద్గీత చదువుతూ ఉంటానని పేర్కొన్నారు."

పురాణాలు, ఇతిహాసాల్లో భగవద్గీత గొప్ప గ్రంథం. నేటి పోటీ ప్రపంచంలో చిన్నవారి నుంచి పెద్దవాళ్ల వరకు ఒత్తిడికి గురవుతున్నారు. ప్రధానంగా విద్యార్థులు ఇందుకు ఎక్కువగా లోనవుతున్నారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించలేదని కొందరు, ర్యాంకులు సాధించలేదని మరికొందరు మానసిక క్షోభకు గురవుతున్నారు. విజయాన్ని తప్ప అపజయాలను తట్టుకునే శక్తిలేకపోవడం, గడ్డు పరిస్థితులు, ఒత్తిడిని ఎదుర్కొనే సామర్థ్యం లేక బలహీనపడుతున్నారు. దీంతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించడానికి భగవద్గీత ఎంతగానో దోహదపడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే), హిందూ ధర్మప్రచార పరిషత్ (హెచ్‌డీపీపీ) అధికారులు భావించారు.



జిల్లాకు చేరిన పుస్తకాలు

విద్యార్థులతో భగవద్గీత చదివించాలనే సంకల్పంతో వారికి ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. అందుకోసం భగవద్గీత సారాంశాన్ని సంక్షిప్తం చేసి 'మానవులందరికీ భగవద్గీత' పేరుతో పుస్తకాన్ని ముద్రించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యార్థులకు ఉచితంగా అందివ్వడానికి సుమారు 50 లక్షల పుస్తకాలను ముద్రించారు. వీటిని అన్ని జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. గుంటూరు జిల్లాకు 20 వేలకు పైగా పుస్తకాలను కేటాయించారు. వాటిని జిల్లాలోని పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యాసంస్థల ప్రతినిధులు చిన్నపాటి పత్రంపై తమ వివరాలు, విద్యార్థుల సంఖ్యను తెలియజేస్తే సరిపోతుందని, పుస్తకాలు అందజేస్తామని అధికారులు తెలిపారు.

విద్యా సంస్థల నిర్వాహకులు సంప్రదించాలి
-అమ్మడు, హిందూ ధర్మప్రచార పరిషత్ సమన్వయకర్త



జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో 5 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను ఉచితంగా అందజేస్తాం. ఆసక్తి ఉన్న విద్యాసంస్థల నిర్వాహకులు గుంటూరు తితిదే కల్యాణమండపంలోని హెచ్‌డీపీపీ కార్యాలయంలో సంప్రదించొచ్చు. ఇతర వివరాలకు ఫోన్ నంబరులో 9989023329 మాట్లాడొచ్చు.

నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం

తెనాలి టౌన్, తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: మంచి ప్రభుత్వం కోసం వేచి చూసి.. ఇప్పుడు భవంతిని అప్పగిస్తున్నామని తెనాలి మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ ముద్దన కస్తూరిబాయి చెప్పడం మాపై మరింత బాధ్యత పెంచిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తెనాలిలోని మహిళా మండలి భవనంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆమె కోరుకున్నట్లే మహిళల శక్తిని పెంచే కార్యక్రమాలకు ఈ భవనాన్ని వేదిక చేస్తామని హామీ ఇస్తున్నానన్నారు. కస్తూరిబాయి మాట్లాడుతూ ఇక్కడ మహిళల నైపుణ్యాభివృద్ధికి బాటలు పడాలని, నాదెండ్ల మనోహర్ మా ఆలోచనలను సాకారం చేస్తారన్న నమ్మకం ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆమె సుమారు రూ.6 కోట్ల విలువైన మహిళా మండలి భవనాన్ని ప్రభుత్వానికి అప్పగిస్తూ, ప్రభుత్వ ప్రతినిధిగా తహసీల్దార్ గోపాలకృష్ణ పేరిట రిజిస్టర్ చేసి దస్తావేజులను మనోహర్, అధికారులకు అందించారు. కార్యక్రమంలో జేసీ భార్గవతేజ, సబ్ కలెక్టర్ సంజనా సింహ, మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న, సబ్ రిజిస్ట్రార్ రమణకుమార్ తదితరులతోపాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. తొలుత డాక్టర్ కస్తూరిబాయిని నాదెండ్ల మనోహర్ ఎదురేగి స్వాగతం పలికి, పూల వర్షం నడుమ సమావేశానికి తోడ్కొని వచ్చారు. డాక్టర్ కస్తూరిబాయి, కోటేశ్వరరావు దంపతులతోపాటు మహిళా మండలి కార్యదర్శి కొసరాజు ఝాన్సీకుమారిని ఘనంగా సత్కరించారు.



డాక్టర్ కస్తూరిబాయి దంపతులు, ఝాన్సీకుమారిని సత్కరిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

విద్యార్థిని జెస్సీ రాజ్‌కు కలెక్టరు అభినందన

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: న్యూజిలాండ్ దేశంలో వరల్డ్ స్కేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ స్కేట్ ఓషేరియా ఆర్టిస్టిక్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్‌లో బంగారు పతకం సాధించిన మంగళగిరి నగరానికి చెందిన విద్యార్థిని జెస్సీ రాజ్‌ని జిల్లా కలెక్టరు ఎస్.నాగలక్ష్మి అభినందించారు. కలెక్టరేట్‌లో నాగలక్ష్మిని జెస్సీ రాజ్, ఆమె తల్లిదండ్రులు సురేష్, రాధ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరు మాట్లాడుతూ చిన్నతనంలోనే 42 పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. భవిష్యత్తులోనూ క్రీడల్లో రాణించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థిని జెస్సీ రాజ్‌ని సన్మానించి ముంబయికి చెందిన మహావతార్ బాబాజీ తాడేకం ఫౌండేషన్ (ఎంబీటీఎఫ్) ప్రోత్సాహకంగా ఇచ్చిన రూ.50 వేల చెక్కును కలెక్టరు అందజేశారు. కార్యక్రమంలో డీపీవో శ్రీదేవి, ఎంబీటీఎఫ్ సమన్వయకర్త వై.సాయి సుధ పాల్గొన్నారు.



విద్యార్థిని జెస్సీ రాజ్‌ని సన్మానించి చెక్కు అందజేస్తున్న కలెక్టరు నాగలక్ష్మి

జీజీహెచ్ స్ట్రోక్ యూనిట్‌కు ఐఎస్‌వో ధ్రువపత్రం

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రి న్యూరాలజీ విభాగం స్ట్రోక్ యూనిట్‌కు ఐఎస్‌వో 9001:2015 ధ్రువపత్రం లభించింది. మౌలిక సదుపాయాలు, వెంటిలేటర్లు, ఆక్సిజన్ సదుపాయం, 24 గంటలూ వైద్య సేవలు ఎలా ఉన్నాయో అధ్యయనం చేసిన అనంతరం ఈ గుర్తింపు దక్కిందని ఆ విభాగం అధిపతి ఆరుణకుమారి తెలిపారు. రోగుల సంరక్షణ, వైద్య సేవల్లో నాణ్యత ఉంటేనే ఈ ధ్రువపత్రం ఇస్తారని వివరించారు. సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, ఏపీ న్యూరో సైంటిస్టుల సంఘ అధ్యక్షుడు తారకనాథ్, కార్యదర్శి విజయ ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను ఆ విభాగం అధిపతి అరుణకుమారికి బుధవారం అందజేశారు.



అరుణకుమారికి ధ్రువపత్రం అందజేస్తున్న కిరణ్‌కుమార్, తారకనాథ్, విజయ తదితరులు

ఇంటెలిజెన్స్ డీఎస్పీగా సుధాకర్‌రావు



గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : ఇంటెలిజెన్స్ డీఎస్పీగా కొసన సుధాకర్‌రావు గుంటూరులోని కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో సీఐగా తెనాలి, గుంటూరులోని పలు పోలీసు స్టేషన్లలో, ఐజీ కార్యాలయంలో విధులు నిర్వహించారు. ఇటీవల డీఎస్పీగా ఉద్యోగోన్నతి పొంది ఇంటెలిజెన్స్ విభాగానికి నియమితులయ్యారు. డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

జూట్‌మిల్లు స్థలంలో అక్రమ కట్టడాలు స్వాధీనం చేసుకోవాలి

జైభీమ్ కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిల్లి బాబూరావు



పట్టాభిపురం, న్యూస్‌టుడే: జూట్ మిల్లు కార్మికులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని జైభీమ్ కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిల్లి బాబూరావు డిమాండ్ చేశారు. గుంటూరులో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'జూట్‌మిల్లును యాజమాన్యం 2015లో అక్రమంగా లాకౌట్ చేసింది. అప్పట్లో తెదేపా హయాంలో మిల్లు తెరిపించేందుకు సమీక్షలు, సమావేశాలు నిర్వహించారు. వైకాపా హయాంలో అసలు ప్రయత్నాలే జరగకపోగా కొందరు అక్రమ కట్టడాలకు అనుమతులు పొందారు. కార్మిక సంఘాలు యాజమాన్యంతో కుమ్మక్కై బెదిరించడంతో 700 మంది కార్మికులు రాజీనామాలు చేయగా.. మరో 100 మంది మిగిలారు. బీఐఎఫ్ఆర్ ద్వారా 1994లో ఖాయిలా పడ్డ పరిశ్రమను 60 శాతం యాజమాన్యానికి, 40 శాతం కార్మికులకు లాభాల్లో వాటా కల్పించేలా మిల్లును తెరిపించారు. కార్మికులు పెట్టాల్సిన 40 శాతం వాటాను జిల్లా పరిశ్రమల శాఖ భరించగా, యాజమాన్యానికి అప్పట్లో సేల్స్ ట్యాక్స్ రాయితీ ఇచ్చారు. కార్మికుల రెక్కల కష్టంతో మిల్లు లాభాల్లో పయనించింది. అయితే 40 శాతం వాటాను కార్మికులకు పంచమని తాము యాజమాన్యాన్ని అడిగితే 1997లో వాటాలు తొలగించారని మార్పులు చేస్తూ ఆదేశాలిచ్చారు. జూట్‌మిల్లుకు చెందిన భూములు, స్థిర, చరాస్తులు యాజమాన్యానికి సొంతం చేసినట్లు ఎక్కడా లేదు. మిల్లును అభివృద్ధి చేసుకుంటూ కార్మికులకు జీవనోపాధి కల్పించాలని సూచించారు. వాటన్నింటినీ తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జూట్‌మిల్లుకు చెందిన రెండున్నర ఎకరాల స్థలాన్ని ఇండస్ట్రియల్ నుంచి తప్పించారు. భవనాలు నిర్మించి అమ్ముకున్నారు. అయిదు ఎకరాల్లోనూ అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారు. ఈ పాపంలో కార్మిక సంఘాల పాత్ర కూడా ఉంది. ప్రభుత్వం స్పందించి అక్రమ కట్టడాలు స్వాధీనం చేసుకొని కార్మికులకు న్యాయం చేయాలి'... అని బాబూరావు కోరారు.

44.9 మి.మీ సగటు వర్షపాతం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు సగటున 44.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దుగ్గిరాలలో అధికంగా 97.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా.. కాకుమాను 92.2, పొన్నూరు 79.2, గుంటూరు పశ్చిమ 72, పెదనందిపాడు 70.4, పెదకాకాని 66.2, గుంటూరు తూర్పు 58.2, కొల్లిపర 42.6, తెనాలి 37.4, మంగళగిరి 32.2, తుళ్లూరు 9.8, ఫిరంగిపురం 27.6, చేబ్రోలు 24, తాడికొండ 2.6, వట్టిచెరుకూరు 19.8, తాడేపల్లి 16.4, ప్రత్తిపాడు 9.4, మేడికొండూరు 9.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

స్టాఫ్ నర్సులను క్రమబద్ధీకరించాల్సిందే

గుంటూరు వైద్యం: ఒప్పంద విధానంలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులను క్రమబద్ధీకరించే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని ఏపీ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ నాయకులు తెలిపారు. జీజీహెచ్ ఎదుట బుధవారం స్టాఫ్ నర్సులు నిరసన కార్యక్రమం కొనసాగించారు. ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సుల పోస్టుల్లో తమను శాశ్వత ప్రాతిపదికన నియమించిన తర్వాత మిగిలిన వాటిని ఇతరులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

కేసులో ఇరికిస్తామని.. రూ.19.80 లక్షలు కొట్టేసి..

యువకుడిని మోసగించిన సైబర్ నేరగాళ్లు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: 'నీ పేరు మనీల్యాండరింగ్ కేసులో నమోదై ఉంది. నిన్ను అరెస్టు చేయడానికి వస్తున్నాం. మీ కుటుంబం పరువు పోతుంది. మీ ఆధార్ కార్డుతో పలు నేరాలున్నాయి.' అని బెదిరించి ఓ యువకుడి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.19.80 లక్షలు కొట్టేశారు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. దుగ్గిరాల మండలం ఈమని గ్రామానికి చెందిన ఎం.వంశీ జ్వాలా రామలింగేశ్వర్ హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నారు. వారం కిందట గ్రామానికి వచ్చారు. ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి 'టెలికం అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి ఫోన్ చేస్తున్నాం. మీ నంబరు బ్లాక్‌లో పెడుతున్నాం. మీపై మనీ ల్యాండరింగ్, డ్రగ్స్ ట్రాఫికింగ్, ఐడెంటిటీ థెఫ్ట్ కేసులు ఉన్నాయి. మిమ్మల్ని ఆన్‌లైన్ కస్టడీ చేస్తున్నాం. ఎప్పుడూ వీడియో కాల్‌లోనే ఉండాలి. మాతో తప్పా ఇంట్లో వారితో కూడా మాట్లాడకూడదు. మీ ఆధార్ కార్డుపై నాలుగు బ్యాంకుల్లో రుణాలు ఉన్నాయి. ముందు వాటిని చెల్లించండి. లేకుంటే 18 ఏళ్ల కఠిన కారాగార శిక్ష పడుతుంది. రాత్రి పడుకునేటప్పుడు కూడా వీడియో కాల్ కట్ చేయకూడదు. ఛార్జింగ్ పెట్టే ఉంచాలి. ఆగిపోతే మేం మీ ఇంటికే వచ్చేస్తాం' అని తీవ్రంగా భయపెట్టారు. దీంతో బెదిరిపోయిన ఆ యువకుడు వారు చెప్పినట్టే చేశాడు. విడతల వారీగా రూ.98,110, రూ.1.99 లక్షలు, రూ.1.70 లక్షలు, రూ.5.16 లక్షలు, రూ.5 లక్షలు చొప్పున రెండు సార్లు వారి ఖాతాల్లో జమ చేయించుకున్నారు. ఇచ్చిన వాటిల్లో రెండు మొత్తాలను నకిలీ యాప్‌ల నుంచి రుణాలుగా వాళ్లే ఇప్పించి, వాటిని వారి ఖాతాల్లో మళ్లీ జమ చేయించారు. ఎందుకని ఆ యువకుడు ప్రశ్నించగా... మీ బ్యాంకు ఖాతా లావాదేవీలన్నింటినీ తనిఖీ చేయాలని, ఆర్‌బీఐ అధికారులు కూడా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. బుధవారం మధ్యాహ్నం 3.45 వరకు వీడియో కాల్‌లోనే ఉన్న ఆగంతకులు.. సాయంత్రం మీ డబ్బు తిరిగి మీ ఖాతాలో జమవుతుందని ఆ యువకుడితో చెప్పి కాల్ కట్ చేశారు. ఎంతకీ నగదు రాకపోవడంతో బాధితుడు తొలుత గుంటూరు సైబర్ క్రైం పోలీసులకు, వారి సూచన మేరకు రాత్రి దుగ్గిరాల ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదైంది.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 126, రిటైల్ ధర - 148, చికెన్ విత్‌స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్ - 244.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 248 చికెన్ స్కిన్‌లెస్ - 258.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 555 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.86/-.

గృహ సామగ్రి పంపిణీ




సామగ్రితో బయలుదేరిన బస్సు వద్ద విజ్ఞాన్ విద్యా సంస్థల అధ్యక్షుడు లావు రత్తయ్య, విద్యార్థులు

పొన్నూరు, న్యూస్‌టుడే: విజ్ఞాన్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో బుధవారం తాడేపల్లిలోని వరద బాధితులకు రూ.5 లక్షలు విలువ చేసే గృహ సామగ్రిని పంపిణీ చేశారు. విశ్వవిద్యాలయ వద్ద సామగ్రి కలిగిన బస్సును విజ్ఞాన్ విద్యా సంస్థల అధ్యక్షుడు లావు రత్తయ్య జెండా ఊపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఉపకులపతి పి.నాగభూషణ్ మాట్లాడుతూ తాడేపల్లిలోని నులకపేట ప్రాంతంలో సుమారు 500 కుటుంబాలకు ఈ సామగ్రి పంపిణీ చేశామని వెల్లడించారు.

వరద బాధితులకు సిటీ కేబుల్ బాసట

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: వరద బాధితులకు సిటీ కేబుల్ (సిటీ సిరి డిజిటల్ నెట్‌వర్క్స్), అసోసియేట్ సభ్యులు బాసటగా నిలిచారు. ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.15,00,116 విరాళం చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబుకు సచివాలయంలో సిటీ కేబుల్ ఎండీ దండమూడి కృష్ణమోహన్ అందించారు. వరద బాధితులకు అండగా నిలిచినందుకు కృష్ణమోహన్‌ను చంద్రబాబు అభినందించారు.



చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న కృష్ణమోహన్ తదితరులు

ఆర్ సెట్ ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బుధవారం ఆర్ సెట్ ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్, వికలాంగులు, క్రీడా కోటాలో సీట్లు దక్కించుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించామని కన్వీనర్ డాక్టర్ బ్రహ్మాజీరావు చెప్పారు. ఏపీ ఆర్ సెట్ ప్రవేశాల కన్వీనర్ వెంకటేశ్వరరావు కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. మొత్తం 105 మంది అభ్యర్థులు తమ ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకున్నారు. క్రీడల కోటాలో సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో కొంత గందరగోళం నెలకొన్నట్లు అభ్యర్థులు తెలిపారు. సర్టిఫికెట్లకు కాలపరిమితి ఉందని అధికారులు చెప్పడంతో అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు అన్ని సర్టిఫికెట్లు తనిఖీ చేసి, ఆ వివరాలు ప్రభుత్వానికి పంపిస్తామని.. ఆపై తీసుకునే నిర్ణయం ఆధారంగా సీట్లు కేటాయిస్తామని చెప్పడంతో అభ్యర్థులు శాంతించారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించారు.

దాడి కేసులో వైకాపా నాయకుల అరెస్టు

పెదకాకాని, న్యూస్‌టుడే : తెదేపా కార్యకర్తలపై దాడి కేసులో ఎనిమిది మంది వైకాపా నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. సీఐ నారాయణస్వామి కథనం ప్రకారం.. పెదకాకాని మండలం అనుమర్లపూడి గ్రామంలో ఈనెల 12న స్థానిక తెదేపా నాయకులు వినాయకుడి నిమజ్జనం సందర్భంగా స్వామిని ఊరేగింపు నిర్వహించారు. గ్రామ పంచాయతీ కూడలి వద్దకు వచ్చేసరికి తెదేపా నాయకులపై వైకాపా నాయకులు ఆరుద్దుల ఫణీంద్ర, దానబోయిన నాగరాజు, దానబోయిన గంగాధరరావు, దానబోయిన మణికంఠ, దానబోయిన నాగేశ్వరరావు, సర్పంచి భర్త దానబోయిన పాములు, ఎంపీపీ శ్రీనివాసరావు, చలమయ్య పిచ్చయ్యలు వీధి దీపాలను ఆర్పేసి రాళ్ల దాడి చేశారు. ఈ దాడిలో తెదేపా నాయకులు ఆరుగురికి గాయాలయ్యాయి. బాధితుడు రేఖా సాంబశివరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎనిమిది మంది నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుల్లో ఎంపీపీ శ్రీనివాసరావు పరారీలో ఉన్నట్లు ఆయన వెల్లడించారు.

అందుబాటులో పోటీ పరీక్షల పుస్తకాలు

తెనాలి(కొత్తపేట): వివిధ రకాల పోటీ పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం రూ.7 లక్షలతో పుస్తకాలు కొని గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ తెలిపారు. ఆమె బుధవారం తెనాలిలో 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. ఇటీవల కావూరులోని భవనం కూలిందన్నారు. గ్రామస్థులు భవన నిర్మాణానికి స్థలం ఇచ్చారని చెప్పారు. మరికొన్ని భవనాలకు మరమ్మతులు చేయించాల్సి ఉందన్నారు. వీటికి ఇప్పటికే అంచనాలు తయారుచేసి పంపించినట్లు చెప్పారు. గ్రంథాలయాల సెస్ రూ.8 కోట్లు రావాల్సి ఉందన్నారు.

గుంటూరు మీదుగా ప్రత్యేక రైలు

గుంటూరు రైల్వే: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గుంటూరు మీదుగా ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు మండల రైల్వే అధికారి తెలిపారు. ఈ రైలు(02811) అక్టోబరు 5 నుంచి నవంబరు 30 వరకు ప్రతి శనివారం భువనేశ్వర్‌లో 19.15 గంటలకు బయలుదేరి విజయవాడకు మరుసటిరోజు 07.25, గుంటూరు 08.35, నరసరావుపేట 09.20, యశ్వంతపూర్ సోమవారం 00.15 గంటలకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (02812) అక్టోబరు 7 నుంచి డిసెంబరు 2 వరకు ప్రతి సోమవారం యశ్వంతపూర్‌లో 04.30 గంటలకు బయలుదేరి నరసరావుపేట 18.29, గుంటూరు 19.20, విజయవాడ 21.30, భువనేశ్వర్ మంగళవారం 12.15 గంటలకు చేరుతుంది.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు


తిరుమల పవిత్రత కాపాడుతాం

ఏటుకూరు (ప్రత్తిపాడు), న్యూస్‌టుడే: తిరుమల ఆలయ పవిత్రతను కాపాడుతామని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. లడ్డూలో కల్తీ నెయ్యి వాడిన కారణంగా ఏటుకూరు అభయాంజనేయ స్వామి ఆలయంలో కూటమి నాయకులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. జనసేన, భాజపా జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, వనమా నరేంద్ర, ఇతర నేతలు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు, నాయకులు

వరద బాధితులకు చేయూత

తాడికొండ, న్యూస్‌టుడే: ఐజీఎం వరద ముంపునకు గురైన విజయవాడ ప్రజలను గుంటూరు జిల్లా తెలుగునాడు అధికార ప్రతినిధి సింగు గోపీకృష్ణ ఆర్థిక సహాయం అందించారు. తెదేపా అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబును బుధవారం సచివాలయంలో కలిసి రూ.1 లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతను సీఎం చంద్రబాబు అభినందించారు.



ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెదకొండూరు(దుగ్గిరాల), న్యూస్‌టుడే: పెదకొండూరు గ్రామం నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను స్థానికుల సహాయంతో పట్టుకుని వెంకట రవి తెలిపారు. వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

? వడ్డమాను గ్రామంలో రహదారుల వెంబడి వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసనతో అసౌకర్యానికి గురవుతున్నాం. **-శ్రీనివాసరావు, గ్రామస్థుడు**

✔ ఆ మార్గంలోని చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తాం. **-శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి**

- న్యూస్‌టుడే, తుళ్లూరు

భారీ వర్షం

పెదనందిపాడు: పెదనందిపాడు మండలంలో బుధవారం అర్ధరాత్రి 70.04 ఎంఎం వర్షపాతం నమోదైంది. పల్లపు ప్రాంతంలోని ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. పత్తి, మిర్చి పొలాల్లో వర్షపు నీరు చేరిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తాగునీరు.. జనం బేజారు

వైకాపా పాలనలో వడపోత బావుల నిర్వహణ గాలికి.. ★ శుద్ధ జలం అందక గ్రామీణుల అవస్థలు


ఐనవోలులో నాచుపట్టిన తాగునీటి చెరువు

తుళ్లూరు, న్యూస్‌టుడే

వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో తుళ్లూరు మండలంలోని తాగు నీటి సరఫరా వ్యవస్థను గాలికొదిలేసింది. కొన్ని సంక్షేమ పథకాలను అమలు చేసి గ్రామ పంచాయతీల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసింది. పంచాయతీలకు కేంద్ర నిధులు రాకపోవడంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. కొన్ని గ్రామాల్లో తాగు నీటి ట్యాంకులు వడపోత బావుల (ఫిల్టర్‌బెడ్లు) ఇసుక మార్చి శుభ్రం చేసే పనుల ఊసే లేకుండా పోయింది. తాగునీటి అవసరాలకు చెరువు నీటిపై ఆధారపడిన గ్రామాల్లో వీటి నిర్మాణం చేపట్టకపోవడం, ఉన్న వాటిని మరమ్మతులు చేయకపోవడంతో స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు కలగానే మిగిలింది.

వ్యాధుల భయం..

తుళ్లూరు మండలంలో 19 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. స్థానికంగా ఉన్న భూగర్భ నీరు ఉప్పగా ఉండడంతో వాడకానికి తప్ప తాగేందుకు పనికిరావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐనవోలు, పెదపరిమి గ్రామాలకు మంచి నీటి చెరువులే ఆధారం. ఇక్కడ వడపోత బావులు మరమ్మతులు చేయకపోవడంతో నేరుగా ఆ నీటినే కొళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఐనవోలులోని ఐదో ట్యాంకు గ్రామానికి ఇదే పరిస్థితి. రంగుమారిన నీటిని వినియోగించడం వల్ల వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తరచూ ఆటంకాలు..

హరిశ్చంద్రపురం నుంచి తాడికొండ వరకు తాగునీటిని సరఫరా చేసే రెండు పథకాల్లో తరచూ సరఫరా నిలిచి పోతోంది. అనంతవరంతో పాటు మరికొన్ని గ్రామాల్లో స్థానిక బోర్ల నీటినే ట్యాంకుల్లో నింపి పంపిణీ చేస్తున్నారు. దీంతో చాలా మంది పేదలు ఆర్థికంగా భారమైనప్పటికీ ప్రైవేటు వాటర్‌ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి స్వచ్ఛ జలం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


హరిశ్చంద్రపురంలో అధ్వానంగా ఫిల్టర్ బెడ్

మండలం: తుళ్లూరు	గ్రామ పంచాయతీలు: 19
జనాభా: సుమారు 54,000	
చెరువులు: 3 (పెదపరిమి, శాఖమూరు, ఐనవోలు)	
వడపోత బావులు: 7	మరమ్మతులు చేయాల్సివి: 5
రక్షిత తాగునీటి పథకాలు: 2 (హరిశ్చంద్రపురం)	

ప్రభుత్వం స్పందించాలి

తాగునీటి ట్యాంకులు ఉన్నా వడపోత బావులు లేవు. దీంతో చెరువు నుంచే నేరుగా అపరిశుభ్ర నీటిని సరఫరా చేస్తున్నారు. తాగడానికి పనికిరావడం లేదు. **- అరుణరావు, గ్రామస్థుడు, ఐనవోలు**

చర్యలు తీసుకుంటాం..

ఐనవోలులో వడపోత బావి నిర్మించేందుకు అంచనాలు ఉన్నతాధికారులకు పంపించాం. మరమ్మతులకు గురైన వాటిలో ఇసుక మార్చి శుభ్రం చేయిస్తాం. త్వరలోనే పనులు చేపడతాం. **- రేష్మా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, తుళ్లూరు**

ఆత్మీయ సత్కారాలు

మంగళగిరి, న్యూస్‌టుడే: పద్మశాలీయ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికైన కందుల నాగార్జునను లక్ష్మీ నరసింహ గోల్డ్‌స్మిత్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు బుధవారం రాత్రి సత్కరించారు. మంగళగిరిలోని షరాఫ్‌బజార్‌లోని సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన అభినందన సభల్లో ఆయన్ని సొసైటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గుంటి నాగరాజు, గాజుల శ్రీనివాసరావు శాలువాకప్పి సత్కరించారు.

దుగ్గిరాల: పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన నందం అబద్ధయ్యను బుధవారం మండల తెదేపా నాయకులు మంగళగిరిలో కలిసి అభినందనలు తెలిపారు. మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, శంకర్‌నాయక్, రవియాదవ్, అనిల్, దేవదాసు, హరనాథ్‌బాబు తదితరులున్నారు.


నాగార్జునను సత్కరిస్తున్న లక్ష్మీనరసింహా గోల్డ్‌స్మిత్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు

మంగళగిరి, న్యూస్‌టుడే: పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్, మంగళగిరి మండల తెదేపా అధ్యక్షుడు తోట పార్థసారథిని పట్టణ, గ్రామీణ మండల చౌక డిపో డీలర్లు బుధవారం సత్కరించారు. రమేష్, నవరత్న ప్రసాద్, లక్ష్మణ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


రావినాయుడిని సన్మానిస్తున్న నాయకులు

కష్టపడి పనిచేసిన వారికి తెదేపాలో గుర్తింపు

తాడికొండ, న్యూస్‌టుడే: తెదేపా కోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని జిల్లా తెలుగు యువత నాయకుడు కట్టా అశోక్ అన్నారు. రాష్ట్ర శాప్ ఛైర్మన్‌గా నియమితులైన రావినాయుడిని బుధవారం సత్కరించారు. నాయకులు పాలడుగు ప్రవీణ్, తాడికొండ నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు చిగురుపాటి అనూప్ పాల్గొన్నారు.

పారదర్శక పాలనే ప్రభుత్వ లక్ష్యం

తాడేపల్లి, న్యూస్‌టుడే: పారదర్శక పాలన అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. తాడేపల్లి పరిధిలోని నులకపేటలో బుధవారం సాయంత్రం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ 100 రోజుల పాలనలో రాష్ట్ర ప్రగతి, సంక్షేమ పథకాల అమలును ప్రజలకు వివరించారు. రాక్షస పాలన అంతమొందించి.. సంక్షేమ పాలనకు సీఎం చంద్రబాబు బాటలు వేస్తున్నారన్నారు. నగరపాలక కమిషనర్ అలీంబాషా మాట్లాడుతూ మంత్రి లోకేశ్ చొరవతో వందరోజుల్లో నగరాభివృద్ధికి అనేక కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జుంజు మరియదాసు, మాజీ కౌన్సిలర్ కాటాబత్తుని నిర్మల, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనురాధ, చిత్రంలో నగరపాలక కమిషనర్ అలీంబాషా

స్వచ్ఛ నగర సాకారమే లక్ష్యం

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: స్వచ్ఛ నగరంగా మంగళగిరి, తాడేపల్లిని తీర్చిదిద్దనున్నట్లు కమిషనర్ అలీంబాషా అన్నారు. స్వచ్ఛతే సేవ-2024లో భాగంగా మంత్రి లోకేశ్ ఆదేశాలతో మంగళగిరి ఎయిమ్స్ నుంచి తాడేపల్లి ప్రకాశం బ్యారేజీ వరకు రహదార్లను శుభ్రపరుస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు ప్రత్యేక యంత్రాల ద్వారా ఈ పనులు చేపట్టినట్లు వివరించారు. బ్లీచింగ్, దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నామన్నారు. ఇందుకోసం పారిశుద్ధ్య సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసి విధులు కేటాయించామని చెప్పారు.


మంగళగిరిలో రహదారిపై బురద తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

నడింపాలెం(ప్రత్తిపాడు), న్యూస్‌టుడే: నడింపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో కార్యదర్శి షేక్.ఖాజా బుధవారం గ్రామంలోని దుకాణదారులకు ప్లాస్టిక్‌ను నిషేధించాలని కోరుతూ నోటీసులు అందించారు.

కౌలు రైతులను ఆదుకోండి

ఫిరంగిపురం, గ్రామీణం, దుగ్గిరాల, పెదనందిపాడు, న్యూస్‌టుడే: ఫిరంగిపురం, మేడికొండూరులో బుధవారం కౌలు రైతు సంఘం నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఫిరంగిపురంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరాగి శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయ పనులు ప్రారంభమై మూడు నెలలు గడిచిందని, 'అన్నదాత సుఖీభవ పథకం' ద్వారా పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేశారు. జీవో 22ను రద్దు చేయాలని విన్నవించారు. మేడికొండూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో కౌలు రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఈ మేరకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు మార్పుల వెంగళరెడ్డి, వెంకటేశ్వర్లు, బొట్ల రామకృష్ణ, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. ➠ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. తహసీల్దార్‌కు సునీతకు వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకర్, వై.బ్రహ్మేశ్వరరావు, ఎన్.యోగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. ➠ పెదనందిపాడు సహకార పరపతి సంఘంలో రైతులకు రుణాల మంజూరు చేయాలని బుధవారం ఏపీ రైతు సంఘం కార్యదర్శి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. తొలుత తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. నాయకులు వెంకటశివరావు, రమేష్‌బాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఫిరంగిపురం తహసీల్దారు కార్యాలయం వద్ద రైతు సంఘం నాయకుల ఆందోళన




దుగ్గిరాలలో..



పెదనందిపాడులో రైతు సంఘం నాయకుల ధర్నా

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఫిరంగిపురం ఎంపీడీవోగా ఎన్.వెంకటేశ్వరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన విమాదేవి నెల రోజుల కిందట కృష్ణా జిల్లా బదిలీ అయ్యారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఎంపీడీవోగా పని చేస్తున్న వెంకటేశ్వరావు ఇక్కడకు వచ్చారు.



ప్రత్తిపాడుకు శివపార్వతి

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు ఎంపీడీవోగా కె.శివ పార్వతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె బాపట్ల జిల్లా రేపల్లె మండలం నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా ప్రత్తిపాడు వచ్చారు. కార్యాలయ ఏవో రామకోటయ్య, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.



సేవా దృక్పథం అవసరం

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థికి విద్యతోపాటు సామాజిక సేవా దృక్పథం అవసరమని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల పాలకవర్గం అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. బుధవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన వక్తృత్వం, వ్యాస రచన, చిత్రలేఖనం, దేశభక్తి గీతాలాపన, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కళాశాల కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, కోశాధికారి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

30న 'చలో గుంటూరు'

తాడేపల్లి, న్యూస్‌టుడే: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 30వ తేదీ 'చలో గుంటూరు' కార్యక్రమానికి సీఐటీయూ పిలుపునిచ్చింది. వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి నిర్వహించే ర్యాలీలో పాల్గొనాలని నాయకులు వేముల దుర్గారావు, బూరగ వెంకటేశ్వర్లు, స్టీవెన్ పేర్కొన్నారు.

చంద్రన్న సాయం.. రైతన్న హర్షం

వరదలకు నష్టపోయిన రైతులకు ఊరట

పెదకొండూరు (దుగ్గిరాల), న్యూస్‌టుడే: వరదలకు పంట నష్టపోయిన రైతులకు సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. నష్ట పరిహార సాయం కింద అందించే సొమ్ము బుధవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి వారివారి ఖాతాల్లో జమ అవుతోంది. పంట కోల్పోయి నష్టాల్లో కూరుకుపోయిన తమకు ప్రభుత్వం అండగా నిలిచిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉద్యాన పంటలకు సంబంధించిన పరిహారం అందుతుండగా.. మండల వ్యాప్తంగా సుమారు 2800 ఎకరాలకు గాను 3728 మంది రైతులు నష్టపోయినట్లుగా బుధవారం ఉదయానికి ఈకేవైసీ పూర్తైంది. మండల అధికారులు దగ్గరుండి మరీ ఈకేవైసీ చేయిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే మిగిలిన వారికీ సొమ్ము అందుతుంది.


నీట మునిగిన వంగ తోట (పాత చిత్రం)

త్వరితగతిన స్పందించారు



నేను వంగ వేశాను. అరెకరం కాబట్టి రూ.5260 వచ్చాయి. గతంలో ఇలా వెంటనే వచ్చిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం సత్వరం స్పందించడంతో సన్నకారు రైతులకు ఎంతో మేలు జరిగింది. ఈ నగదుతో కొత్త పైరు వేసుకునేందుకు వెసులుబాటు కలిగింది. **-మట్టా రాజ, పెదకొండూరు**

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



నేను అరెకరం వంగ వేశాను. పంట పూర్తిగా మునిగిపోయింది. నాకు పరిహారంగా రూ. 5760 బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. గతంలో ఇలా నష్టపోయినప్పుడు అసలు ఇవ్వని సందర్భాలు ఉన్నాయి. ప్రభుత్వానికి కృతజ్ఞతలు

- సోమరౌతు నాగేశ్వరరావు, పెదకొండూరు

సచివాలయ ఉద్యోగుల పని తీరుపై విచారణ

మేడికొండూరు, ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ సచివాలయ ఉద్యోగుల పని తీరుపై ఉన్నతాధికారులు దృష్టిసారించారు. మేడికొండూరు, ఫిరంగిపురం మండల పరిధిలో కొంత మంది ఉద్యోగుల పని తీరు బాగోలేదని 'ఈనాడు'లో ఈ నెల 24న 'అంతా మాఇష్టం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు బుధవారం ఆయా గ్రామాల్లో విచారణ చేశారు.

ప్రజాభిప్రాయ సేకరణ

మంగళగిరి, ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర విజన్-2047 నాటికి అన్ని రంగాల్లో రాష్ట్ర అభివృద్ధికి అందరూ సహకరించాలని తెదేపా నాయకుడు గోవాడ దుర్గారావు కోరారు. మంగళగిరి టిప్పర్ల బజారులో విజన్ ప్రణాళికపై ప్రజల నుంచి సలహాలు, సూచనలు సేకరించారు. అడిషినల్ కమిషనర్ శకుంతల, నాయకులు పాల్గొన్నారు. నల్లపాడులో కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మి, తెదేపా నాయకులు అభిప్రాయాలను సేకరించారు.

అవీ ఇవీ

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

తాడేపల్లి, న్యూస్‌టుడే: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరికీ అవగాహన, శ్రద్ధ అవసరమని కేఎల్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారావు అన్నారు. వర్సిటీలో బుధవారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈసీజీ, చక్కెరస్థాయి, రక్తపోటు, ఎకో తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు భరత్‌చంద్ర, ప్రసాదరెడ్డి, వీసీ డాక్టర్ పార్థసారథివర్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపిక

దుగ్గిరాల, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు 17 ఏళ్ల లోపు విభాగంలో ఈమని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు పెనుమాక వాసు, పరిశ ఉమామహేశ్వరరావు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ వాణి, పీడీ జమీర్ బుధవారం తెలిపారు. వీరిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ రాంబాబు తదితరులు అభినందించారు.

వీవోఏపై చర్యలు తీసుకోండి

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: వట్టిచెరుకూరు గాయత్రి పొదుపు సంఘానికి చెందిన చంద్రావతిని వీవోఏ విధుల నుంచి తొలగించామని, రికార్డులు, డబ్బు లావాదేవీల పుస్తకాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆమెపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కార్యాలయంలో డీఆర్‌డీఏ పీడీకి బుధవారం వట్టిచెరుకూరు మహిళలు ఫిర్యాదు చేశారు. మహిళల నుంచి వసూలు చేసిన డబ్బుకు రసీదులు ఇవ్వడం లేదని, 2017లో రూ.6.25 లక్షలు పొదుపు నిల్వలు ఉండగా ప్రస్తుతం బ్యాంకులో ఆ డబ్బు లేదని పేర్కొన్నారు.

దీన్ దయాళ్ సేవలు చిరస్మరణీయం

మంగళగిరి, న్యూస్‌టుడే: భారతీయ జన్ సంఘ్ సహ వ్యవస్థాపకుడు పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ సేవలు చిరస్మరణీయమైనవని వక్తలు పేర్కొన్నారు. ఆయన జయంతి సందర్భంగా మంగళగిరిలోని భాజపా కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా వెంకట శివన్నారాయణ, పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు పంచుమర్తి ప్రసాద్, పట్టణ అధ్యక్షులు కాండ్రు భానుకిషోర్ నివాళులర్పించారు.

ముగిసిన ఫార్మసిస్ట్ వేడుకలు

నగరపాలకసంస్థ: చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్స్ సైన్సెస్ కళాశాలలో బుధవారం ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవం సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగిన కార్యక్రమాల్లో మొదటి రోజు చౌడవరం లలితా నగర్‌లో వైద్యశిబిరం నిర్వహించారు. రెండో రోజు నగరంలోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్‌లో డాక్టర్ డి.సందీప్ ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం, క్విజ్ నిర్వహించారు. ఓబులునాయుడుపాలెం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.విద్యాధర, పాలకవర్గం అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వర్సిటీలోకి రాకుండా బాధిత కుటుంబ సభ్యుల అడ్డగింత

కొద్దిసేపటి తర్వాత లోపలికి అనుమతి

తుళ్లూరు, న్యూస్‌టుడే: వీఐటీ యూనివర్సిటీ బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సాయి శ్రియ ఈ నెల 17న బలవన్మరణానికి పాల్పడింది. ఈ క్రమంలో తమ కుమార్తె ఆత్మహత్యకు దారి తీసిన కారణాలను తెలుసుకునేందుకు బుధవారం తల్లి మంజుల, బంధువులు వర్సిటీకి వచ్చారు. కానీ సెక్యూరిటీ సిబ్బంది లోపలికి అనుమతించకపోవడంతో వారు అక్కడే కూర్చున్నారు. ఈ క్రమంలో మంజుల మీడియాతో మాట్లాడుతూ 'వీసీతో మాట్లాడాలి. తమ కుమార్తె ఎన్ని రోజులు తరగతులకు హాజరైందో.. చనిపోయిన రోజు ఏం జరిగిందో తెలుసుకోవాలని వస్తే చెప్పడం లేదు. మా బాధ ఎవరికి చెప్పుకోవాలి' అని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వర్సిటీ యాజమాన్యం అనుమతితో వసతి గృహంలోకి వెళ్లి సాయి శ్రియకు చెందిన సామగ్రి తీసుకున్నారు. వర్సిటీ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కాగా, విద్యార్థిని చెందిన రెండు సంవత్సరాల ఫీజులను యాజమాన్యం ఆమె తల్లిదండ్రులకు తిరిగి ఇచ్చేస్తున్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న తుళ్లూరు పోలీసులు వర్సిటీ వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు.

మధ్యాహ్న భోజనం చేయకపోతే ట్యాబ్‌లు తీసుకోండి

చినకొండ్రుపాడు(ప్రత్తిపాడు), న్యూస్‌టుడే: పాఠశాలలో మధ్యాహ్న భోజనం తినని విద్యార్థుల నుంచి ట్యాబ్‌లు తీసుకోవాలని సమగ్ర శిక్షా అసిస్టెంటు ప్రాజెక్టు సమన్వయకర్త విజయలక్ష్మి ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్‌కు సూచించారు. ప్రత్తిపాడు మండలం చినకొండ్రుపాడు జడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యత లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తొలుత ప్రత్తిపాడు మండల ప్రత్యేకాధికారి హోదాలో కోయవారిపాలెం లేఅవుట్‌ను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఎంపీడీవో కార్యాలయంలో లేఔట్లలో గృహ నిర్మాణంపై మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. హాజరు కాని అధికారులకు షోకాజు నోటీసులు ఇవ్వాలని ఏవో రామకోటయ్యను ఆదేశించారు. గృహనిర్మాణ శాఖ ఏఈ సురేశ్, డీఈ సత్యనారాయణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే 'కూటమి' ప్రభుత్వ ధ్యేయం

తాడికొండ, న్యూస్‌టుడే: వైకాపా రాక్షస పాలన నుంచి ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చి 100 రోజులు దాటిందని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. రావెల గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో పైన హెలికాప్టర్‌లో వెళ్తూ ..కింద రోడ్డుపై జనాన్ని నిలిపివేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ఏడు పదుల వయసులోనూ చంద్రబాబు వరద నీటిలో తిరుగుతూ ప్రజలకు అండగా నిలిచారన్నారు. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.25,000 ఆర్థిక సాయం అందించడం చరిత్రాత్మకం అన్నారు.


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

ఉద్యోగులు పనితీరు మార్చుకోవాలి

పెదనందిపాడు, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం బటన్ నొక్కడంతోనే కాలం గడిపిందని ఎమ్మెల్యే రామాంజనేయులు విమర్శించారు. అబ్బినేనిగుంటపాలెంలో బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం'లో భాగంగా చిమటా సంజీవ్ కల్యాణ మండపంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు కొందరు తమ పని తీరు మార్చుకోకపోతే తీవ్ర చర్యలుంటాయని హెచ్చరించారు. గుంటూరు ఛానల్ పొడిగింపునకు, నల్లమడ ఆధునికీకరణకు రూ.1200 కోట్లతో అంచనాలు తయారు చేసి సీఎంకు అందించామన్నారు. అనంతరం ఆయన గోరిజవోలుగుంటపాలెం సందర్శించి అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులర్పించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సామాజిక మాధ్యమాల్లో తమకు వ్యతిరేకంగా పోస్టు పెట్టారని, దాన్ని తాము లెక్కచేయమన్నారు. తమ పార్టీకి ఓటు వేసిన వేయకపోయినా అందరినీ ఒకేలా ఆదరిస్తామని స్పష్టం చేశారు. సర్పంచి ఆర్.కృష్ణప్రసాద్, తెదేపా, జనసేన నాయకులు శ్రీకాంత్, వందనాదేవి, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, హనుమంతరావు, చెంచయ్య, తహసీల్దార్ శంకరబాబు, ఎంపీడీవో లక్ష్మీదేవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

బాలకార్మిక రహిత మండలంగా 'దుగ్గిరాల'

దుగ్గిరాల, తుళ్లూరు, వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, కార్మికశాఖ ఉప కమిషనర్ దుగ్గిరాల మండలాన్ని బాలకార్మిక రహిత మండలంగా ప్రకటించారని ఎంఈవో కాజ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ సునీత, ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి శరత్, కార్మికశాఖ జిల్లా సమన్వయకర్త సమీర్‌కుమార్, సుభాని, సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులతో కలిసి గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. 18 ఏళ్ల లోపు పిల్లలు ఎవరూ పనుల్లో ఉండకూడదని స్పష్టం చేశారు. బాలకార్మికుల సమాచారాన్ని 94925 55159కు అందించవచ్చన్నారు. *మందడం గ్రామంలోని ఎస్టీ కాలనీలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్వాడీ సూపర్ వైజర్ సీతారావమ్మ, అత్తోట పోతురాజు, నాగమణి తదితరులు పాల్గొన్నారు. * వట్టిచెరుకూరులో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. కార్మికశాఖ అధికారి వినయ్‌కుమార్, ఎంఈవోలు సత్యనారాయణమూర్తి, నిర్మల, ప్రధానోపాధ్యాయులు రమాదేవి, కార్మిక అధికారి సుభాని పాల్గొన్నారు.

తెనాలి

●తెనాలి ● పొన్నూరు

ఎంపీకి ఘన స్వాగతం



లావు శ్రీకృష్ణదేవరాయలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీఎన్ఎస్ఎఫ్, టీఎన్‌టీయూసీ నాయకులు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: సార్వత్రిక ఎన్నికలలో విజయం సాధించిన తర్వాత తొలిసారి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి వచ్చిన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలకు టీఎన్ఎస్ఎఫ్, టీఎన్‌టీయూసీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఏఎన్‌యూ ప్రధాన ద్వారం వద్ద పుష్పగుచ్ఛాలు ఇచ్చి సాదరంగా ఆహ్వానించారు. ఆచార్య నాగార్జునుడి విగ్రహానికి ఎంపీ పూలమాల వేసి అంజలి సమర్పించారు. అనంతరం ఉద్యోగులతో కలిసి వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో వికాస ప్రధాన కార్యదర్శి కావూరి శ్రీనివాస్, నాగపట్నం నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, రత్తయ్య, రమేష్‌బాబు, కనకరాజు, నితీష్‌యాదవ్, భాగ్యారావు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికే ప్రాధాన్యం



ములుకుదురు గ్రామంలో గోడపత్రికలను విడుదల చేస్తున్న మండల అధికారులు, నాయకులు

పొన్నూరు, న్యూస్‌టుడే: 100 రోజుల పరిపాలనలో రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికే అధిక ప్రాధాన్యం కల్పించిందని మండల అభివృద్ధి అధికారి అడిగొప్పల శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం ములుకుదురు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు మాదాల వెంకటేశ్వర్లు, బొర్రు రామారావు, బండ్లమూడి బాబూరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి



హోమం నిర్వహిస్తున్న పండితులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఆంధ్ర వాల్మీకి శ్రీవాసుదాసుస్వామి పరంపర పీఠం దాసకుటి, అంగలకుదురులో ఈనెల 11 నుంచి జరుగుతున్న శ్రీమహాలక్ష్మి అమ్మవారి కుంకుమ పూజలు, సత్యనారాయణస్వామి వారి వ్రతాలు, హనుమాన్‌చాలీసా పారాయణం బుధవారంతో ముగిశాయి. పూర్ణాహుతి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్న ఆధ్యాత్మిక వేడుకలను సీతారామశర్మ పట్టాభి పర్యవేక్షించారు.

మూడు రోజులు ఆర్జిత సేవలు నిలిపివేత

పెదకాకాని, న్యూస్‌టుడే: దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 29న పవిత్రోత్సవాలు ప్రారంభించనున్నట్లు ఈవో గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఈ పవిత్రోత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహించనున్న నేపథ్యంలో ఆలయంలోని రాహుకేతు, స్వామి వారి ఆర్జిత సేవలు నిలిపి వేసినట్లు వెల్లడించారు. అక్టోబరు 2వ తేదీ యథావిధిగా పూజలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు.

వర్షం పడితే వెతలే..



108 సిబ్బంది గదిలోకి వచ్చిన వర్షపు నీరు

చేబ్రోలు,న్యూస్‌టుడే: ప్రమాదంలో ఉన్న వారికి వైద్య సేవలు అందించడంతో పాటు వెంటనే వైద్యశాలకు తరలించే 108 అంబులెన్స్ సిబ్బంది కనీసం కూర్చునేందుకు అవకాశం లేకుండా పోతోందని వాపోతున్నారు. 108 సేవలు ప్రారంభించిన సమయంలో పాత పంచాయతీ కార్యాలయంలో వెనుకవైపు చిన్న గదిని కేటాయించారు. ప్రస్తుతం గది పైకప్పు శిథిలావస్థకు చేరింది. వర్షం పడిన ప్రతిసారీ నీళ్లు లోపలికి చేరుతున్నాయి. సిబ్బందే వాటిని బక్కెట్లకు ఎత్తి బయటకు పోస్తున్నారు. సుమారు ఏడాది కిందట చేబ్రోలు పంచాయతీ పాలక వర్గం నూతన గది నిర్మాణానికి రూ.6 లక్షల నిధులు మంజూరు చేసింది. కొంత పని చేసి నిర్మాణం మధ్యలోనే నిలిపివేశారు. గది పూర్తయ్యేదాకా తమకు ఈ తిప్పలు తప్పవని, వెంటనే నిర్మాణం పూర్తి చేయాలని సిబ్బంది కోరుతున్నారు.



మధ్యలోనే నిలిచిపోయిన భవనం

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష వితరణ

మోపిదేవి, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా తెనాలికి చెందిన కొడాలి ప్రతాప్ కుమార్-సంధ్యారాణి దంపతులు బుధవారం మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష బుధవారం వితరణగా అందించారు. దాతల కుమారుడు కొడాలి షణ్ముఖ్ పేరిట ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాద్‌కు నగదు అందజేశారు. దాతల కుటుంబాలకు స్వామి దర్శనం, వేద ఆశీర్వచనం, శేషవస్త్రాలతో సత్కరించి సన్మానించారు.



నిత్యాన్నదాన పథకంకు నగదు అందిస్తున్న దాతలు

మాటలు చెప్పారు.. పనులు మరిచారు..!

జగనన్న కాలనీలో కొరవడిన వసతులు

పొన్నూరు, న్యూస్‌టుడే

వైకాపా పాలనలో నిడుబ్రోలు జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తామని ఆపార్టీ నేతలు మాటలతో కాలయాపన చేశారు. మౌలిక వసతులు కల్పించకపోవడంతో కాలనీవాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలను పరిష్కరించమని స్థానికులు అనేకసార్లు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని వాపోతున్నారు. కాలనీలో ప్రధాన, అంతర్గత రహదారులు చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారాయి. ఆ మార్గాల్లో రాకపోకలకు అవస్థలు పడుతున్నామని కాలనీ వాసులు చెబుతున్నారు. దిచక్ర వాహనాలు బురదలో అదుపు తప్పడంతో చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. భవన నిర్మాణ సామగ్రిని తరలించే వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయి. దీంతో సామగ్రి తరలించడానికి వాహనదారులు ముందుకు రావడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సామగ్రి అందుబాటులో లేకపోవడంతో కొన్ని భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

పట్టణం	నిడుబ్రోలు
కాలనీలో గృహాలు	4,685
పూర్తయిన ఇళ్లు	350
వివిధ దశల్లో ఉన్నవి	2,150
రహదారులు	21 కి.మీ



గృహాల చుట్టూ చేరిన వర్షపు నీరు



నిడుబ్రోలు జగనన్న కాలనీలో ప్రధాన రహదారి ఇలా..

భూమి మెరక చేయక...

జగనన్న కాలనీలో గృహాలు నిర్మించే ముందు భూమి మెరక చేయలేదు. మాగాణి భూములను వైకాపా ప్రభుత్వం ప్లాట్లుగా మార్చి పంపిణీ చేసింది. గృహాల చుట్టూ పల్లంగా ఉండడంతో వర్షం కురిసినప్పుడు నీరు చేరుతోంది. అవి పోయే మార్గం లేక రోజులు తరబడి అక్కడే నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. మురుగు నీటి కాలువ సౌకర్యం లేకపోవడంతో సమస్య మరింత ఇబ్బందికరంగా మారింది. స్థలాలు కేటాయించాక కాలనీలో మౌలిక వసతులు కల్పించే ప్రక్రియకు ప్రభుత్వం ఎటువంటి నిధులు మంజూరు చేయలేదని కాలనీ వాసులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి కాలనీలో మౌలిక వసతులకు నిధులు మంజూరు చేయాలని వీరు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం.. గృహ నిర్మాణ శాఖ సహాయ ఇంజినీర్ సాగర్‌ను న్యూస్‌టుడే వివరణ కోరగా రహదారుల పనులకు ప్రతిపాదనలు తయారుచేసి గతంలోనే ఉన్నతాధికారులకు పంపించామని వెల్లడించారు.

పొన్నూరు అర్బన్ ఎస్సైగా శ్రీహరి

పొన్నూరు, న్యూస్‌టుడే: పొన్నూరు అర్బన్ ఎస్సైగా శ్రీహరి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో తుళ్ళూరు, కర్లపాలెంలలో పనిచేశారు.

వరి యాజమాన్యంపై అవగాహన

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం తెనాలి మండలం హాఫ్‌పేట, ఖాజీపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు వరి పంట యాజమాన్యం గురించి వివరించారు. సహాయ సంచాలకులు ఉషారాణి, మండల వ్యవసాయాధికారి ప్రేమసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

దీన్‌దయాళ్‌కు నివాళి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా బుధవారం తెనాలి మండలం అంగలకుదురులో భాజపా నాయకులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వాసదేవనాయుడు, నందకిషోర్, కామేశ్వరరావు, శ్రీనివాసు, యోగానంద కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టుల సేవలు విలువైనవి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ఆచార్య ప్రమీలారాణి

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ కళాశాలలో బుధవారం ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు పెట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫార్మసిస్ట్స్ మీటింగ్ గ్లోబల్ హెల్త్ నీడ్స్ సదస్సును ప్రిన్సిపల్ ఆచార్య ప్రమీలారాణి ప్రారంభించి ప్రసంగించారు. సమాజానికి ఫార్మసిస్టుల సేవలు ఎంతో విలువైనవన్నారు. వ్యాధి నిరోధక టీకాలు వేయడంలో వీరి పాత్ర కీలకమని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు అన్నపూర్ణ, మస్తానమ్మ, సుజనా, గాయత్రి రమ్య, విజయ్‌కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. బాల్యవివాహాల నిర్మూలన- ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల పాత్ర అనే అంశంపై ఈ పోటీలు జరిపారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా ఈపోటీలు పెట్టామని ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ దివ్యతేజోమూర్తి చెప్పారు. కార్యక్రమంలో యుగంధర్, పుణ్యశేఖర్, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా మండలి భవనంలోనే యథావిధిగా గ్రంథాలయం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: తెనాలి కొత్తపేటలోని మహిళా మండలి భవనంలో మూడు దశాబ్దాలుగా నడుస్తున్న మహిళా బాలల గ్రంథాలయాన్ని యథావిధిగా నిర్వహించుకోవచ్చని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ అభయమిచ్చారని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ తెలిపారు. బుధవారం ఆమె మహిళా బాలల గ్రంథాలయంలో మాట్లాడారు. ఈ భవనాన్ని ప్రభుత్వానికి అప్పగించిన సందర్భంగా మంత్రి మనోహర్‌ను కలిసి గ్రంథాలయం గురించి వివరించినట్లు ఆమె తెలిపారు. మహిళా మండలి అనుమతి తీసుకొని ఈ భవనంలోని మూడు గదులను ఉచితంగా గ్రంథాలయానికి వినియోగించుకుంటున్నట్లు ఆమె వివరించారు. ఈ భవనానికి మరమ్మతులు చేయించాల్సి ఉందన్నారు. వీటిని రెండు నెలల్లో చేయించి అవసరమైన మార్పులు చేర్పులు చేయాలని కమిషనర్ బండి శేషన్నకు మంత్రి మనోహర్ సూచించినట్లు ఆమె తెలిపారు.

నష్టాలు నమోదు చేయించండి



తహసీల్దార్ గోపాలకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మొన్నటి వర్షాలకు నష్టపోయిన నిమ్మ, అరటి తోటల నష్టాలను నమోదు చేయలేదని, వెంటనే చేయించాలని, పెట్టుబడి సాయం అందించాలని రైతు సంఘ ప్రతినిధులు, రైతులు తహసీల్దార్ గోపాలకృష్ణను ఆయన కార్యాలయంలో బుధవారం కలిసి కోరారు. ఈమేరకు వినతిపత్రం అందించారు. తాను ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళతానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శివసాంబిరెడ్డి, ఆదినారాయణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొల్లిపర: నియోజకవర్గ స్కూల్ ఫెడరేషన్ క్రీడాపోటీల్లో అథ్లెటిక్స్ విభాగంలో తూములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని ప్రధానోపాధ్యాయిని రత్నరాణి బుధవారం తెలిపారు. షాట్‌పుట్‌లో కాకానిగణేష్, హైజంప్‌లో సాయిరాకేష్, ఇతర క్రీడాంశాల్లో మనోహర్, వెంకటసాయితేజ, సాయికార్తీక్, జి.ప్రభుదాస్, జె.నాగేంద్ర, టి.జాన్సన్ ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాలు దక్కించుకున్నారని వెల్లడించారు. ఈ విజేతలు ఈనెల 27న నంబూరులో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో తలపడనున్నట్టు ఫెడరేషన్ అధ్యక్షులు ఎం.సూర్యప్రకాశరావు తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ట్రైబల్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తెనాలి మండలం కొలకలూరు గ్రామంలోని కాలువ కట్ట నివాసితులైన పేదలకు బుధవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. ట్రస్ట్ ఛైర్మన్ రావూరి అంజలి పర్యవేక్షించారు.

ట్రాఫిక్ సలహా సంఘ సమావేశం ఏర్పాటు చేయండి

తెనాలి టౌన్: తెనాలిలో ట్రాఫిక్ సలహా సంఘ సమావేశం చాలా కాలంగా జరగడం లేదని, సంబంధిత విభాగాల అధికారులు నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలని శ్రీశక్తి లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధి చలపతిరావు బుధవారం ప్రకటనలో కోరారు.

సేంద్రియ ఎరువుల వాడకం పెరగాలి

శలపాడు(చేబ్రోలు),న్యూస్‌టుడే: పంటలకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాల్సిన అవసరం ఉందని మండల తెదేపా అధ్యక్షుడు రామరాజు అన్నారు. మండలంలోని శలపాడు, సుద్దపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తే ఆ పంటకు ప్రకృతి విపత్తులను తట్టుకునే శక్తి ఉంటుందన్నారు. ఏవో శ్రీనివాసానాయక్, ఏఈవో సునీత, రైతులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమంపై అవగాహన

తెనాలి(కొత్తపేట): స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంపై ప్రజల నుంచి వచ్చిన సూచనలు, సలహాలు అధికారులు నమోదు చేసుకున్నారు. వీరు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం బుధవారం పట్టణంలోని 1 నుంచి 20 వార్డుల్లో నిర్వహించిన స్వర్ణాంధ్ర-2047పై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. మరుగు కాలువలు శుభ్రం చేయడం లేదని, రేషన్ కార్డులు ఇప్పించాలని, ఇంటి నెంబర్లు వేయించాలని, తాగునీటి పైపులు, వీధి దీపాలు వేయాలని వార్డుల్లోని ప్రజలు అధికారులను కోరారు. వీటిని సిబ్బంది నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వార్డు కౌన్సిలర్లు, తెదేపా, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పొన్నూరు, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పురపాలక సంఘం కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు సూచించారు. బుధవారం నిడుబ్రోలు పార్కులో కార్మికులతో కలిసి కమిషనర్ పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతత కోసం పార్కులను ఏర్పాటు చేశారని, వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. నిడుబ్రోలు పార్కులో వ్యాయామ పరికరాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. పార్కులో ఇంకా అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నిడుబ్రోలు తెదేపా అధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్‌బాబు, గోగినేని రజనీకుమార్, పొన్నగంటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నిడుబ్రోలు పార్కులో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న కమిషనర్ రమేష్‌బాబు



విద్యార్థుల ప్రదర్శన

కొల్లిపర, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమని విద్యార్థులు నినదించారు. స్వచ్ఛతాహీసేవ కార్యక్రమంలో భాగంగా కొల్లిపర ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం గ్రామంలో ప్రదర్శన చేపట్టారు. ప్రధానోపాధ్యాయులు మృత్యుంజయరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చారిత్రక భవనం..పురపాలక సంఘ పర్యవేక్షణలోకి..



మహిళా దాతల చిత్రాలను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: చారిత్రక తెనాలి మహిళా మండలి భవనం బుధవారం నుంచి పురపాలక సంఘ పర్యవేక్షణలోకి వచ్చింది. భారతీయ మహిళా మండలి అనుబంధ సంస్థగా తెనాలి మహిళా మండలి స్వాతంత్ర్య సమరయోధురాలు దుర్గాబాయి దేశ్‌ముఖ్ చేతుల మీదుగా ప్రారంభమైంది. మహిళల సమస్యల పరిష్కారాల కోసం, వారి హక్కుల కోసం మండలి వేదికగా జరిగిన కార్యక్రమాలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. కళలు, కవులకు సైతం ఇది మంచి వేదిక. స్థల సేకరణకు, భవంతి నిర్మాణానికి విరాళాలు ఇచ్చిన దాతలు కూడా మహిళలే కావడం విశేషం. నిర్దేశించిన మొత్తం ఇచ్చిన వారి చిత్రపటాలు భవంతి ప్రధాన గదిలో అప్పట్లోనే ఏర్పాటు చేశారు. భవనాన్ని ప్రభుత్వానికి అప్పగించిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నాదెండ్ల మనోహర్ ఆనాటి దాతల చిత్రాలను ఆసక్తిగా గమనించారు. భవనం రెవెన్యూ విభాగానికి రిజిస్టర్ కాగా పర్యవేక్షణ పురపాలక సంఘం చేయనుంది.

బాలు గానం అమరం



బాలసుబ్రహ్మణ్యం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న రావిపాటి వీరనారాయణరావు, ఇతర ప్రతినిధులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: బాలసుబ్రహ్మణ్యం గానం అమరమని, ఎంచుకున్న రంగంలో నిత్య సాధనతో అత్యున్నత స్థాయికి చేరిన ఆయన ప్రస్థానం నేటి యువతకు ఆదర్శమని వివేక విద్యాసంస్థల డైరెక్టర్ రావిపాటి వీరనారాయణరావు పేర్కొన్నారు. బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా తెనాలి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక వివేక మహిళా కళాశాల ప్రాంగణంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. బాలు జీవిత పయనం ఆయన సాధించిన విజయాల తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన బాలు సంగీత విభావరి ఆకట్టుకుంది. రామరాజు, బొల్లిముంత కృష్ణ, నీలాంబరం, జగదీశ్వరి, ప్రియాంక, దివ్య, నాగేశ్వరరావు, నవీన్, ఠాగూర్ తదితరులతోపాటు అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు హాజరయ్యారు.

అన్నదానం: బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా కోట అక్కేశ్వరరావు ఆధ్వర్యంలో కుర్రా శ్రీను పర్యవేక్షణలో రైల్వే స్టేషన్ రోడ్డులో పేదలకు అన్నదానం చేశారు. నన్నపనేని రాంబాబు, సాంబశివరావు, సురేష్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన సీనియర్ అకౌంటెంట్

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: మున్సిపల్ ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా రేపల్లె పురపాలక సంఘం నుంచి సీనియర్ అకౌంటెంట్ రాజగోపాల్ తెనాలి మున్సిపాలిటీకి వచ్చారు. ఆయన విధుల్లో చేరినట్లు మున్సిపల్ అధికారులు బుధవారం తెలిపారు.

పరిహారం జమపై హర్షం

పెదకాకాని: ఇటీవల వరదల కారణంగా పంటలు నష్టపోయిన రైతులు, ఇళ్లు ధ్వంసమైన బాధితుల బ్యాంకు ఖాతాలకు బుధవారం ప్రభుత్వం పరిహార నగదు జమ చేయడంపై పెదకాకాని తెదేపా అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

మార్కండేయబాబుకు సత్కారం

గుంటూరు: రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యులుగా నియమితులైన వడ్రాణం మార్కండేయబాబును పలువురు అభినందించారు.

200 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



బియ్యం లారీ డ్రైవర్‌ను విచారిస్తున్న పొన్నూరు గ్రామీణ ఎస్సై కిరణ్

పొన్నూరు, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని చింతలపూడి వద్ద బుధవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. బాపట్ల పట్టణ పరిధిలోని ఓ రైస్ మిల్లు నుంచి లారీలో 200 కింటాళ్ల రేషన్ బియ్యాన్ని తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా మధిరకు తరలిస్తున్నారు. పొన్నూరు గ్రామీణ ఎస్సై కిరణ్‌బాబు తెల్లవారుజామున చింతలపూడి వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో రేషన్ బియ్యం లారీని తనిఖీ చేసి అందుకు సంబంధించిన పత్రాలు చూపించమని డ్రైవర్లను ఎస్సై కోరారు. ఎటువంటి అనుమతి పత్రాలు చూపించకపోవడంతో అనుమానం వచ్చి బియ్యాన్ని పరిశీలించారు. అనంతరం లారీని గ్రామీణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. పొన్నూరు పౌరసరఫరాల శాఖాధికారిణి భవనేశ్వరికి పోలీసులు సమాచారాన్ని చేరవేశారు. బియ్యాన్ని ఆమె పరిశీలించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

చేబ్రోలు,న్యూస్‌టుడే: కుటుంబ సభ్యుల మధ్య వివాదం కారణంగా చేబ్రోలులోని పాతరెడ్డిపాలేనికి చెందిన మద్దు జయమ్మ మంగళవారం సాయంత్రం ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. భర్త సామ్యేలు ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకటకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

గొలుసు లాక్కొని పరారీ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణ ముత్తంశెట్టివారిపాలెంలో బుధవారం రాత్రి స్థానిక దుకాణం నుంచి పాలప్యాకెట్టు తీసుకుని తిరిగి ఇంటికి వస్తున్న మహిళ మెడ నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన యువకుడు బంగారపు గొలుసు లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి ఆచూకీ గుర్తింపు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణ మొండి గోడల వద్ద మంగళవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి కింజారపు తులసీరావు(60)గా గుర్తించినట్లు తెనాలి రైల్వే పోలీసులు బుధవారం తెలిపారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇతను గత 20 సంవత్సరాలుగా ఒంటరిగా జీవిస్తూ క్యాటరింగ్ సప్లయర్‌గా విజయవాడ, గుంటూరు, తెనాలి ప్రాంతాల్లో పని చేస్తూ ఉంటాడని, ఒంటరితనంతో విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నామని వివరించారు.

పొంచి ఉన్న ప్రమాదం

పొన్నూరు, న్యూస్‌టుడే: నిడుబ్రోలు- జూపూడి మార్గంలో సాగునీటి కాలువపై ఏర్పాటు చేసిన వంతెన ప్రమాకరంగా మారింది. వంతెనకు ఇరువైపులా రెయిలింగ్ లేకపోవడంతో వాహనాలు ఎదురెదురు వచ్చినప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఎటువంటి ప్రమాదం జరగక ముందే అధికారులు మేల్కొని తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



జూపూడి మార్గంలో వంతెన ప్రమాదకరంగా..

గుంటూరు తూర్పు

రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోంది


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

ఎన్టీఆర్ సర్కిల్, నెహ్రూనగర్, న్యూస్‌టుడే: గత అయిదేళ్ల జగన్ పాలనలో అధోగతి పాలై కొన ఊపిరితో ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి చంద్రబాబు అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నారని ఎమ్మెల్యే నసీర్ పేర్కొన్నారు. బుధవారం నియోజకవర్గంలో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం', స్వర్ణాంధ్ర-2047 సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. 100 రోజుల పాలనలో పింఛన్ల మొత్తం పెంపు, అన్న క్యాంటీన్ల ప్రారంభం, డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేశారని చెప్పారు. స్థానిక సంస్థలకు రూ.1452 కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్ చిష్టి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడండి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలోని ఆలయాల వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని ఎస్పీ సతీష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిన్నాటవర్ హిమని కూడలి నుంచి పట్నంబజార్, కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం వరకు ట్రాఫిక్ పరిస్థితిని ఎస్పీ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. . విజయదశమికి కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహించే ఉత్సవాల సందర్భంగా ఆ మార్గంలో ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, ఎస్బీ సీఐ అళహరి శ్రీనివాసరావు ఉన్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయండి

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: నగరపాలకసంస్థ పరిధిలో డివిజన్ల వారీగా మౌలిక సదుపాయాల కల్పనకు అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం ఆయన బుడంపాడులో పర్యటించి ప్రజలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. తాగునీరు, డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణం వంటి పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. తాగునీటి సరఫరాపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరించాలని చెప్పారు. వార్డు సచివాలయ కార్యదర్శులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. పర్యటనలో ఈఈ కొండారెడ్డి, డీసీపీ శ్రీనివాస్, డీఈఈ కల్యాణరావు తదితరులున్నారు.


సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ శ్రీనివాసులు

దాడి ఘటనపై కేసు నమోదు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: దాడి ఘటనపై బుధవారం కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామిరెడ్డితోటకు చెందిన ధర్మతేజ డీజే సిస్టమ్ పెట్టుకొని జీవిస్తున్నాడు. అతని సోదరుడు అశోక్‌కు, కొత్తపేటకు చెందిన యూసఫ్‌కు మధ్య గొడవ జరుగుతుందని తెలియడంతో అక్కడికి వెళ్లాడు. రామిరెడ్డితోటలో యూసఫ్ తన స్నేహితులతో కలిసి అశోక్‌ను కొట్టడం చూసిన ధర్మతేజ ఆపాలంటూ అడ్డువెళ్లారు. తనపై దాడి చేశారంటూ ధర్మతేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ధర వరలు

ఎన్టీఆర్ రైతు బజారులో ధరలు నిన్నటివి...(కిలో రూ.ల్లో) టమాట 35, వంగ 38, బెండ 35, పచ్చిమిర్చి 18, కాకర 38, క్యారెట్ 48, క్యాలీఫ్లవర్ 34, క్యాబేజీ 24, బీర 24, దొండ 39 బంగాళదుంప 39, ఉల్లిపాయలు 55, గోరుచిక్కుళ్లు 34, దోస 24, పొట్ల 30, మునగ 6, పెద్ద చిక్కుళ్లు 34, చామదుంప 38, మునగ 6, గోంగూర 8, తోటకూర 10, కొత్తిమీర 50, బీట్‌రూట్ 32, కీర 34, క్యాప్సికం 64, అల్లం 95, ఫ్రెంచి బీన్స్ 55, సొర 10, అరటి 7.

- న్యూస్‌టుడే, పట్నంబజారు

ప్రధాన ప్రాంతాల్లో..
రెండేసి సార్లు శుభ్రం చేయాల్సిందే


జీజీహెచ్ ప్రాంగణంలో చెత్తతో నిండిన బిన్లు

నగరంలో చెత్త సమస్య పరిష్కారానికి చొరవ అవసరం

ప్రధాన ప్రాంతాలైన మార్కెట్, జీజీహెచ్, రైల్వేస్టేషన్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో చెత్త పాయింట్లను నిత్యం శుభ్రం చేయించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత పారిశుద్ధ్య విభాగం అధికారులపై ఉన్నా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. రద్దీ ప్రాంతాలు, జనసమ్మర్థ స్థలాల్లో రోజుకు రెండు సార్లు చెత్త తరలించాల్సిన అవసరం ఉంటుంది. అధికారులు ఆదిశగా ఆలోచన చేయకపోవడంతో పలుచోట్ల ఉదయం డంపర్‌బిన్లలో పడిన చెత్తను తరలించినా అక్కడ మధ్యాహ్నం కల్లా మళ్లీ చెత్త పేరుకుపోయి సమస్యలు వస్తున్నాయి. దీని పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.


మార్కెట్ వద్ద శిథిలమైన డంపర్‌బిన్

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే

నగరంలో స్వచ్ఛతే సేవలో భాగంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నా..ప్రధాన ప్రాంతాల్లో పారిశుద్ధ్యం దిగజారుతోంది. నగరంలో నిత్యం ఇంటింటి నుంచి తడి, పొడి చెత్త సేకరణతోపాటు బాక్‌స్పాట్ల వద్ద చెత్త నిర్దేశిత సమయానికి తరలించాల్సి ఉంది. కానీ చెత్త తరలింపులో నిర్లక్ష్యంతో సమస్యలు వస్తున్నాయి.

శానిటరీ డివిజన్లు	22
బ్లాక్ స్పాట్లు	750
రద్దీ ప్రాంతాల్లోనివి	150
నెలకు చెత్త తరలింపు ఖర్చు	సుమారు రూ.10 కోట్లకు పైగా
పారిశుద్ధ్య కార్మికులు	2200
చెత్త తరలింపు వాహనాలు	98

వ్యర్థాలు పేరుకుపోతోంది ఎక్కడెక్కడంటే..

ప్రజారోగ్య, పారిశుద్ధ్యవిభాగం పరిధిలోని డివిజన్ల వారీగా తదినంత మంది సిబ్బంది ఉన్నా క్షేత్రస్థాయిలో చెత్త సమస్యలు మాత్రం అలాగే ఉంటున్నాయి. ప్రభుత్వ సర్వజనాసుపత్రితోపాటు నగరపాలకసంస్థ ఎదుట మార్కెట్ వద్ద, పండ్ల మార్కెట్, బస్టాండ్, నాజ్‌సెంటర్ ప్రాంతాల్లో ఉదయం చెత్త తరలించినప్పటికీ మధ్యాహ్నం కల్లా తిరిగి ఆయా ప్రాంతాలు వ్యర్థాల మయంగా మారి పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. దుర్వాసన వెదజల్లుతోంది. ప్రధానంగా ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చేవారు ఇక్కడ పరిస్థితులతో తాము ఎక్కడ రోగాల బారిన పడాల్సి వస్తుందోని ఆందోళన చెందుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు బ్లాక్ స్పాట్లపై దృష్టి సారించి చెత్త ఉత్పత్తి అధికంగా ఉన్న చోట్ల రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో చెత్త తొలగించేలా ప్రణాళికలు తయారు చేసుకోవాల్సి ఉందన్న అభిప్రాయం వ్యక్తమౌతోంది.

వెలగని సిగ్నల్ లైట్లు



పాత బస్టాండు సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు వెలగకపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంది. సిగ్నల్ లైట్లు వెలగకపోవడంతో కొందరు వాహనచోదకులు ఇష్టానుసారంగా వాహనాల్ని నడుపుతున్నారు. దీంతో ఇక్కడ విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీసులకు తిప్పలు తప్పడం లేదు. పోలీసు ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి సిగ్నల్ లైట్లకు మరమ్మతులు చేయించాలని నగరవాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పట్నంబజారు

ముఠా కార్మికుల కూలి రేట్లు పెంచండి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : ముఠా కార్మికుల కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ బుధవారం సివిల్ సప్లయిస్ గోదాముల వద్ద కార్మికులు కళ్లకు నల్లరిబ్బన్లు కట్టకొని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు మాట్లాడుతూ సివిల్ సప్లయిస్ కార్మికుల రేట్ల ఒప్పందం ముగిసి 9 నెలలు అవుతున్నా కూలీరేట్లు పెంచకపోవడం సరికాదన్నారు. కూలీ రేట్లు పెంచుతూ జీవో విడుదల చేయాలన్నారు. తమ సమస్యలు పరిష్కరించేవరకు దశలవారీగా ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మరియదాసు, అంజయ్య, కాంతారావు, దాసు, డేవిడ్, జాన్‌బాబు, సురేష్, మరియబాబు, కిరణ్, బుజ్జి, నాగరాజు పాల్గొన్నారు.



నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలుపుతున్న కార్మికులు, అంజిబాబు

మార్కండేయబాబుకు సత్కారం



నెహ్రూనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యులుగా నియమితులైన జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి వడ్రాణం మార్కండేయబాబును ఆయన కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ నాయకులు అయిశెట్టి శ్రీనివాసరావు, కార్పొరేటర్ కనకదుర్గ సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

దర్పణం


నెహ్రూనగర్‌కు వెళ్లే మార్గంలో ఇలా..


చెరువును తలపించిన లీలామహల్ రహదారి


బురదమయంగా కుగ్లర్ ఆసుపత్రి దారి

మారని రహదారుల దుస్థితి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే

నగరంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో లోతట్టుప్రాంతాలు జలమయంగా మారాయి. ఆర్టీసీ కాలనీ, సీతానగర్, న్యూగుంటూరు, నెహ్రూనగర్, కొత్తపేట, లీలామహల్‌రోడ్డు, రైల్వేస్టేషన్, బోసుబొమ్మ సెంటర్, మూడువంతెనలు తదితర ప్రాంతాల్లో రహదారులు చెరువులను తలపించాయి. రోడ్లపై గుంతల్లో మురుగునీరు నిలిచింది. దీంతో ఆయా రహదారులపై రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వచ్చిందని వాహనచోదకులు వాపోయారు. భారీ వర్షానికి సైడుకాలువలు పొంగిపొర్లడంతో మురుగురోడ్లపై ప్రవహించింది. వాన ఆగిన తర్వాత రహదారులపై మురుగు పేరుకుపోవడంతో వాటిపై రాకపోకల క్రమంలో వాహనాలు అదుపు తప్పి గాయాలపాలవుతున్నామని ఆందోళన చెందుతున్నారు. నగరంలో వర్షం పడితే రహదారులు చెరువులుగా మారుతున్న పరిస్థితులతో సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్నామని, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.


విజయటాకీస్ దారిలో నిలిచిన మురుగు నీరు

పల్నాడు బస్టాండ్ జలమయం

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: నగరపాలకసంస్థకు కూతవేటు దూరంలో ఉన్న పల్నాడు బస్టాండ్ ప్రాంతంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో జలమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రధాన కాల్వల్లో పూడికలు పేరుకు పోవడంతో వర్షంనీరు బుధవారం మధ్యాహ్నం కూడా అలాగే ఉంది. కూరగాయల మార్కెట్‌లోనూ ఇదే పరిస్థితి ఉండడంతో వర్షం నీటిలోనే రాకపోకలు చేస్తూ కొనుగోలుదారులు ఇబ్బందులు పడ్డారు. మోటార్లు పెట్టి నీటిని తోడించాల్సి వచ్చిందని ఇక్కడి వారు చెబుతున్నారు. ప్రధాన కాల్వలపై ఆక్రమణలు తొలగించి పూడికలు తీసేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేస్తున్నా క్షేత్రస్థాయిలో సిబ్బంది మాత్రం నిర్లక్ష్యం వీడడం లేదు. నగరపాలకసంస్థ చుట్టుపక్కలే సమస్యలు ఉన్నా పారిశుద్ధ్య విభాగం అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి కాల్వల పూడికలు తీయించి వర్షంనీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



ఎస్పీ బాలుకు కళాదర్బార్ నివాళి



గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: కళాదర్బార్-అమరావతి సంస్థ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు ఆధ్వర్యంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నాలుగో వర్ధంతి బుధవారం నిర్వహించారు. నాజ్ కూడలిలోని బాలు కాంస్య విగ్రహం వద్ద గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్, తదితరులు పాల్గొని పుష్పమాలలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం ఆర్చిడ్ హోటల్‌లో బాలు స్వర నిరాజనం పేరున సంగీత విభావరి జరిగింది. కార్యక్రమంలో బాలస్వామి, రాజశేఖర్, హనుమాన్‌సింగ్, వేణుగోపాలరావు, ధర్మసింగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు ఏఈల బదిలీ

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: విద్యుత్తు సంస్థలో పనిచేస్తున్న పలువురు ఏఈలను బదిలీ చేస్తూ గుంటూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు విజయకుమార్ ఆదేశాలిచ్చారు. గుజ్జనగుండ్ల డి-4 సెక్షన్ ఏఈ అక్కిరెడ్డిని బ్రాడీపేట డి-1 సెక్షన్‌కు మార్చారు ఇక్కడ పనిచేస్తున్న అంజనీరావును డి-4కు బదిలీ చేశారు. డి-12 సెక్షన్ ఏఈ బ్రహ్మయ్యను పెదకాకానికి అక్కడ పనిచేస్తున్న శ్రీనివాసరావును డి-2 సెక్షన్‌కు మార్చారు. డి-11 సెక్షన్ ఏఈ కిరణ్‌కుమార్‌ను సత్తెనపల్లికి బదిలీ చేశారు. డి-6 ఏఈ వెంకటేశ్వర్లును డి-12 సెక్షన్‌కు మార్చారు. సంగడిగుంట ఎస్‌పీఎంలో పనిచేస్తున్న శ్రీనివాసరావును డి-11కి బదిలీ చేశారు.

విజన్- 2047 సాకారానికి యువతే కీలకం


మాట్లాడుతున్న డాక్టర్ రామ్‌నాథ్

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు కలలు కంటున్న వికసిత్ భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ సాకారానికి దేశంలో 60 శాతం మేర ఉన్న యువతే కీలకమని గ్లోబల్ ఫోరం ఫర్ సస్టైయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ రామ్‌నాథ్ వెలమాటి పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ మహిళా కళాశాలలో ఎకనామిక్స్, కామర్స్ విభాగాల ఆధ్వర్యంలో సెర్చ్ ఎన్జీవో సహకారంతో 'విజన్- 2047' పేరుతో కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్‌నాథ్ మాట్లాడుతూ.. దేశం ప్రస్తుతం విద్య, వైద్యం, వ్యవసాయం, ఆరోగ్య, ఆర్థిక, రక్షణ, శాస్త్ర సాంకేతిక, వైజ్ఞానిక రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందన్నారు. కార్యక్రమంలో పాత్రికేయులు డాక్టర్ శాఖమూరి శ్రీనివాసప్రసాద్, సెర్చ్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు ఎం.హనుమాన్‌ప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ వీఆర్.జోత్స్నకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : జిల్లా జైలులోని ఖైదీలకు బుధవారం వివిధ రకాల వ్యాధులపై అవగాహన కల్పించారు. ఐసీటీసీ కౌన్సిలర్ జి.శ్రీనివాసరావు, పీపీటీసీటీ కౌన్సిలర్ కె. శ్రీనివాసరావు, షిప్ అధ్యక్షులు రమాదేవి, సమన్వయకర్త రవిలు అతిథులుగా హాజరయ్యారు. వ్యాధుల నిర్ధారణ, సంక్రమించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల విధానం గురించి కారాగారంలోని ఆసుపత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు. వ్యాధులపై అప్రమత్తత అవసరమని సూచించారు. కార్యక్రమంలో జైలు పర్యవేక్షకులు రఘు, డిప్యూటీ జైలర్లు కళ్యాణ్‌బాబు, అశోక్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ జయంతి

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని భాజపా జిల్లా సభ్యత్వ ప్రముఖ్ పాలపాటి రవికుమార్ ఆధ్వర్యంలో పశ్చిమలోని 138వ పోలింగ్ బూత్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి పారిశుధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈదర శ్రీనివాసరెడ్డి, నరసరావుపేట జిల్లా ఇన్‌ఛార్జి కొక్కెర శ్రీనివాస్, నాలుగో మండల అధ్యక్షుడు ఆవుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎదుటే ఆక్రమణలు.. పట్టించుకోరా..



నగరపాలకసంస్థ: రహదారి మార్జిన్‌లు, కాల్వలపై ఆక్రమణలు తొలగించాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేస్తున్నా చాలా ప్రాంతాల్లో ఇంకా అలాగే ఉన్నాయి. నగరపాలకసంస్థ ఎదుటే హిందూ కాలేజీ హైస్కూల్ పక్కగా పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్‌లోకి వెళ్లే దారిలో పలు దుకాణాలు రహదారిపైనే ఉంచి విక్రయాలు చేస్తుండడంతో ఇబ్బందులు వస్తున్నాయి. గుమ్మడికాయల వ్యాపారులు సరకును రహదారి మార్జిన్‌లో వేస్తున్నారు. దీనితో మార్కెట్‌లోకి వెళ్లే వారు తమ వాహనాలను దుకాణాల ఎదుట ఉంచడం వలన రహదారి ఇరుకుగా మారి సిటీబస్సులు నిలిపేందుకు కూడా స్థలం ఉండడం లేదు. బస్సులను రహదారిపైనే పార్కింగ్ చేసి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. దీంతో వెనుకగా వచ్చే ట్రాఫిక్ నిలిచిపోయి సమస్యలు వస్తున్నాయి. వెంటనే రహదారి మార్జిన్, కాల్వలపై ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మహిళాభ్యుదయానికి పోరాడిన కవి జాషువా


విజయశ్రీని సన్మానిస్తున్న మాజీ మంత్రి మాణిక్యవరప్రసాద్, లక్ష్మణరెడ్డి తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మహాకవి గుర్రం జాషువా మహిళాభ్యుదయం ఆశించిన కవి అని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని శ్రీశారదనికేతన్‌లో జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో 'జాషువా సాహిత్యంలో స్త్రీ' అనే అంశంపై బుధవారం సభ నిర్వహించారు. సభకు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ తెలుగు సాహితీ లోకంలో మహిళల అభ్యున్నతి కోసం మహాకవి జాషువా విస్తృతంగా రచనలు చేశారని తెలిపారు. సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలపై తన కలంతో పోరాడారని వివరించారు. జాషువా తన రచనల్లో మహిళల కోసం అనేక ఖండ కావ్యాలను రాశారని వివరించారు. సభలో జేకేసీ కళాశాల విశ్రాంత అధ్యాపకురాలు మట్టా విజయశ్రీని కళాశాల కరస్పాండెంట్ జి.శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.కోటిరత్నం, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంజేజేఎస్ అధ్యక్షుడు పినపాటి మోహన్‌రావు, ప్రముఖ పద్య గాయకుడు ఎనుబరి చంద్రపాల్, భీంసేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం, బత్తుల కోటేశ్వరరావు, న్యాయవాది సంజీవరెడ్డి, చావలి బాలస్వామి, గాయకుడు పి.వి.రమణ, పునులూరి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామాజిక సేవా దృక్పథం అవసరం



ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థులు

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థికి విద్యతోపాటు సామాజిక సేవా దృక్పథం అవసరమని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల పాలకవర్గం అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. బుధవారం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం, దేశభక్తి గీతాలాపన, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. తమ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు అనేక విపత్తుల్లో సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారని కళాశాల కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గం కోశాధికారి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని, ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని వినతి

గుంటూరు నేరవార్తలు: అగ్రిగోల్డ్ కంపెనీ మోసానికి భారీగా నష్టపోయిన ఖాతాదారులు, ఏజెంట్స్‌కు న్యాయం జరిగేలా చూడాలని అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు బుధవారం డీజీపీ ద్వారకా తిరుమలరావును ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ ఏడు అంశాలతో కూడిన విజ్ఞాపన పత్రం అందించారు. స్పందించిన డీజీపీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారని ముప్పాళ్ల తెలిపారు.

గుంటూరు పశ్చిమ

వ్యాధి నిర్ధారణ పరీక్షలకు బయటకు పంపొద్దు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రికి చికిత్సకు వచ్చే రోగులకు సంబంధించి వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం ప్రయివేటు ప్రయోగశాలలకు పంపొద్దని రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు నరసింహం సూచించారు. విజయవాడ నుంచి బుధవారం సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ టీటీకే రెడ్డితో జూమ్ కాన్ఫరెన్స్‌లో నరసింహం మాట్లాడుతూ బోధనాసుపత్రుల హాజరును రోజూ పరిశీలించాలన్నారు. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులకు అక్టోబరులో తరగతులు ప్రారంభం అవుతున్నందున ర్యాగింగ్ అనేది లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

సందడిగా స్వాగతోత్సవం

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాల అలైడ్ కోర్సుల విద్యార్థులకు విజ్ఞాన మందిరంలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. తొలుత కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణుడు, అలైడ్ కోర్సుల డైరెక్టర్ డాక్టర్ జె.ఉమామహేశ్వరరావు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏఎన్‌యూ రెక్టార్ రత్నషీలామణి, గౌరవ అతిథి అయ్యప్ప మాట్లాడుతూ విద్యార్థులందరూ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, కళాశాల డైరెక్టర్ ఉమామహేశ్వరరావులు మాట్లాడారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
97042 53525, 80085 74897

? అమరావతి రోడ్డులోని బీవీఆర్ కల్యాణ మండపం ఎదురుగా మారుతీ వీధిల్లో ఉన్న కాలువలో చెత్త అడ్డుగా ఉండడంతో మురుగు పారడం కావడంలేదు. దోమలు, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. **- స్థానికులు, అమరావతి రోడ్డు**

✔ వెంటనే సిబ్బందిని పంపి మురుగును తొలగింపజేస్తాం. **- సోమశేఖర్, శానిటరీ సూపర్‌వైజర్, జీఎంసీ**

? ఏటీ అగ్రహారం 6/2లో వీధి దీపం(42/ఎ/14) కొన్ని రోజులుగా వెలగడం లేదు. రాత్రి సమయాల్లో ఇబ్బందులు పడుతున్నాం. **-స్థానికులు, ఏటీ అగ్రహారం**

✔ వీధి దీపానికి త్వరలోనే మరమ్మతులు చేయిస్తాం. వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- రవికిరణ్, ఏఈ, జీఎంసీ**

చెత్త తరలింపు: తెలుగు వెలుగు అపార్ట్‌మెంట్ నుంచి మెడికల్ క్లబ్ వరకు రహదారులపై చెత్త, చెదారం పేరుకుపోయి అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. ఈ మార్గంలో వెళ్లాలంటే దుర్వాసనతో ఆ ప్రాంతవాసులు అవస్థలు పడుతున్నారు. సమస్యపై 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా జీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి రహదారిపై చెత్తను తొలగించారు. **- న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

స్పందనకు వందనం

ఏఈల బదిలీ

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: విద్యుత్తు సంస్థలో పనిచేస్తున్న పలువురు ఏఈలను బదిలీ చేస్తూ గుంటూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు విజయకుమార్ ఆదేశాలిచ్చారు. గుజ్జనగుండ్ల డి-4 సెక్షన్ ఏఈ అక్కిరెడ్డిని బ్రాడీపేట డి-1 సెక్షన్‌కు మార్చారు. ఇక్కడ పనిచేస్తున్న అంజనీరావును డి-4కు బదిలీ చేశారు. డి-12 సెక్షన్ ఏఈ బ్రహ్మయ్యను పెదకాకానికి అక్కడ పనిచేస్తున్న శ్రీనివాసరావును డి-2 సెక్షన్‌కు మార్చారు. డి-11 సెక్షన్ ఏఈ కిరణ్‌కుమార్‌ను సత్తెనపల్లికి బదిలీ చేశారు. డి-6 ఏఈ వెంకటేశ్వర్లను డి-12 సెక్షన్‌కు మార్చారు. సంగడిగుంట ఎస్పీఎంలో పనిచేస్తున్న శ్రీనివాసరావును డి-11కి బదిలీ చేశారు.

ప్రధాన ప్రాంతాల్లో..

రెండేసి సార్లు శుభ్రం చేయాల్సిందే



జీజీహెచ్ ప్రాంగణంలో చెత్తతో నిండిన బిన్లు

నగరంలో చెత్త సమస్య పరిష్కారానికి చొరవ అవసరం

ప్రధాన ప్రాంతాలైన మార్కెట్, జీజీహెచ్, రైల్వేస్టేషన్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో చెత్త పాయింట్లను నిత్యం శుభ్రం చేయించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత పారిశుద్ధ్య విభాగం అధికారులపై ఉన్నా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. రద్దీ ప్రాంతాలు, జనసమ్మర్ధ స్థలాల్లో రోజుకు రెండు సార్లు చెత్త తరలించాల్సిన అవసరం ఉంటుంది. అధికారులు ఆ దిశగా ఆలోచన చేయకపోవడంతో పలుచోట్ల ఉదయం డంపర్ బిన్లలో పడిన చెత్తను తరలించినా అక్కడ మధ్యాహ్నం కల్లా మళ్లీ చెత్త పేరుకుపోయి సమస్యలు వస్తున్నాయి. దీని పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.



మార్కెట్ వద్ద శిథిలమైన డంపర్‌బిన్

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే

నగరంలో స్వచ్ఛతే సేవలో భాగంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నా..ప్రధాన ప్రాంతాల్లో పారిశుద్ధ్యం దిగజారుతోంది. నగరంలో నిత్యం ఇంటింటి నుంచి తడి, పొడి చెత్త సేకరణతోపాటు బ్లాక్‌స్పాట్ల వద్ద చెత్త నిర్దేశిత సమయానికి తరలించాల్సి ఉంది. కానీ చెత్త తరలింపులో నిర్లక్ష్యంతో సమస్యలు వస్తున్నాయి.

శానిటరీ డివిజన్లు	22
బ్లాక్ స్పాట్లు	750
రద్దీ ప్రాంతాల్లోనివి	150
నెలకు చెత్త తరలింపు ఖర్చు	సుమారు రూ.10 కోట్లకు పైగా
పారిశుద్ధ్య కార్మికులు	2200
చెత్త తరలింపు వాహనాలు	98

వ్యర్థాలు పేరుకుపోతోంది ఎక్కడెక్కడంటే..

ప్రజారోగ్య, పారిశుద్ధ్యవిభాగం పరిధిలోని డివిజన్ల వారీగా తదినంత మంది సిబ్బంది ఉన్నా క్షేత్రస్థాయిలో చెత్త సమస్యలు మాత్రం అలాగే ఉంటున్నాయి. ప్రభుత్వ సర్వజనాసుపత్రితోపాటు నగరపాలకసంస్థ ఎదుట మార్కెట్ వద్ద, పండ్ల మార్కెట్, బస్టాండ్, నాజ్‌సెంటర్ ప్రాంతాల్లో ఉదయం చెత్త తరలించినప్పటికీ మధ్యాహ్నం కల్లా తిరిగి ఆయా ప్రాంతాలు వ్యర్థాల మయంగా మారి పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. దుర్వాసన వెదజల్లుతోంది. ప్రధానంగా ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే వారు ఇక్కడ పరిస్థితులతో తాము ఎక్కడ రోగాల బారిన పడాల్సి వస్తుందోని ఆందోళన చెందుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు బ్లాక్ స్పాట్లపై దృష్టి సారించి చెత్త ఉత్పత్తి అధికంగా ఉన్న చోట్ల రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో చెత్త తొలగించేలా ప్రణాళికలు తయారు చేసుకోవాల్సి ఉందన్న అభిప్రాయం వ్యక్తమౌతోంది.

సర్వజనాసుపత్రికి ఏపీ న్యూరో సైంటిస్టుల సాయం

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రి న్యూరాలజీ, న్యూరో సర్జరీ విభాగాల్లో వైద్య విద్య బలోపేతానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఏపీ న్యూరో సైంటిస్టుల సంఘం గుంటూరు శాఖ రూ. 4 లక్షల సాయం చేశారు. న్యూరాలజీ విభాగంలో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్‌కు ల్యాప్‌టాప్ అందజేశారు. ఏపీ న్యూరో సైంటిస్ట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సు సందర్భంగా మిగిలిన మొత్తం నుంచి సాయం చేసినట్లు ఆ సంఘం కార్యదర్శి విజయ తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు తారకనాథ్, కోశాధికారి శివరామకృష్ణ, ఆచార్యులు సత్యనారాయణమూర్తి, వీరమ్మ, సహాయ ఆచార్యులు బిందునర్మద తదితరులు పాల్గొన్నారు.



కిరణ్‌కుమార్‌కు ల్యాప్‌టాప్ అందజేస్తున్న తారకనాథ్, విజయ, శివరామకృష్ణ తదితరులు

రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటాలి

గుంటూరు క్రీడలు: రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబర్చాలని పాటిబండ్ల సీతారామయ్య పాఠశాల కార్యదర్శి పాటిబండ్ల విష్ణువర్ధన్ సూచించారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల పదో తరగతి విద్యార్థిని శ్రావణిని బుధవారం అభినందించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ కృష్ణవేణి, ప్రిన్సిపల్ పద్మజ పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థి వైద్యురాలి ప్రతిభ

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రి చర్మ, సుఖ, కుష్ఠు విభాగం విద్యార్థి వైద్యురాలు భార్గవికి క్విజ్ పోటీల్లో ద్వితీయ స్థానం లభించింది. విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలలో ఈనెల 22న ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంతీయ వైద్య విద్య కార్యక్రమంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో భార్గవి ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా జీజీహెచ్‌లో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో భార్గవికి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ జ్ఞాపిక అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఆ విభాగం అధిపతి మోహనరావు, సహాచార్యులు హనుమానాయక్, శ్రీనివాసప్రసాద్, సహాయ ఆచార్యులు శ్రీదేవి పాల్గొన్నారు.

ఇటొస్తే.. గుంతలో కూరుకుపోవాల్సిందే..

స్థానిక కంకరగుంట ఆర్‌యూబీ వద్ద ఏటీ అగ్రహారం వైపు మలుపు తిరిగే ప్రదేశంలో గుంత ఏర్పడింది. ఆ గుంతపై ఎప్పుడూ నీరు నిలిచి ఉండడంతో కార్లు అటుగా మలుపు తిరిగే సమయంలో గుంతలో ముందు చక్రం ఇరుక్కుంటుంది. కొద్ది రోజులుగా రోజూ ఏదొక వాహనం ఇలా ఇరుక్కుపోతూనే ఉందని స్థానికులంటున్నారు. అటుగా వెళ్లే వారు సాయంతో ఎలాగోలా వాహనం వెనక్కి లాగుతున్నారని, అధికారులు ఇప్పటికైనా వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా గుంతపై గ్రిల్ ఏర్పాటు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, గోరంట్ల**



వైద్య శిబిరాలు.. చైతన్య కార్యక్రమాలు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవం సందర్భంగా చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. చౌడవరంలోని లలితానగర్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. స్థానికులకు రక్తపోటు, మధుమేహం పరీక్షలు చేశారని ప్రిన్సిపల్ డాక్టర్ విద్యాధర తెలిపారు. డాక్టర్ కేఎల్‌పీ పాఠశాలలో డాక్టర్ సందీప్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఓబులనాయుడుపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి జంపని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ప్రదర్శనలో విద్యార్థులు

రెండు రోజుల కోడింగ్ సవాల్

ఏటి అగ్రహారం, న్యూస్‌టుడే: గుంటూరు శివారులోని కళ్లం హరనాథ రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కోడ్ స్ప్రింట్-2024 పేరున రెండు రోజులు కోడింగ్ ఛాలెంజ్ పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ పోటీల్లో 400 మంది బీటెక్, ఎంసీఏ విద్యార్థులు పాల్గొన్నారు. కేవీవీఎస్ మనోహర్, హుజేఫా, బి.ఈశ్వర్ బృందాలు వరుస బహుమతులు సాధించారని కళాశాల డైరెక్టర్ ఎం.ఉమాశంకరరెడ్డి తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.ఎస్.బి.రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని పలు ఇంజినీరింగ్ కళాశాలలను కూడా ఆహ్వానించి పోటీలు నిర్వహించామని తెలిపారు. ప్రముఖ కోడింగ్ ప్లాట్‌ఫాం కోడ్ తంత్ర వారు వీటిని నిర్వహించారని ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ శివరామకృష్ణ తెలిపారు. డాక్టర్ పి.ఎల్.మాధవరావు, డాక్టర్ బి.శ్రీకాంత్, డాక్టర్ బి.బిందు మాధవి, డాక్టర్ కె.హరికృష్ణలు కన్వీనర్లుగా వ్యవహరించారు.



గెలుపొందిన వారితో కళాశాలలోని విభాగాల అధిపతులు



భారతి విద్యా భవన్ నుంచి రెడ్‌క్రాస్‌కు వెళ్లే దారిలో



మడుగులా ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డు

దారులన్నీ.. ఏరులై..

ఏటీ అగ్రహారం, కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: చిన్నపాటి వర్షానికి కూడా నగరంలో రహదారులు తటాకాలను తలపిస్తున్నాయి. వర్షం పడిన ప్రతిసారీ రోడ్లపై నీరు రోజుల తరబడి నిలిచిపోతుండడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. రోడ్లన్నీ గుంతలమయం కావడం, వర్షం పడినప్పుడు నీరు నిలిచిపోయి ఎక్కడ ఎంత పెద్ద గుంత ఉందో తెలియక బెంబేలెత్తుతున్నారు. మంగళవారం అర్ధ రాత్రి దాటాక నగరంలో భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు, శివారు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. భారతీ విద్యా భవన్ నుంచి రెడ్‌క్రాస్‌కు వెళ్లే దారి చినుకు పడితే చాలు కాలువలా దర్శనమిస్తుంది. వర్షం తగ్గినా నాలుగైదు రోజుల పాటు నీళ్లు ఎటూ వెళ్లకుండా అక్కడే నిలిచిపోతాయి. అధికారులకు తెలియజేసినా పట్టించుకునేవారు లేరని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డు, శాంతి నగర్ 1వ లైన్ తదితర మార్గాలన్నీ అధ్వానంగా మారిపోతున్నాయి.



శాంతి నగర్ ఒకటో లైన్‌లో పరిస్థితీ..

ప్రజా భాగస్వామ్యంతో రాష్ట్రాభివృద్ధి

పట్టాభిపురం: అభివృద్ధిలో ప్రజల్ని భాగస్వామ్యం చేయడం చంద్రబాబుకే సాధ్యమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. 42వ డివిజన్‌లో 'ఇది మంచి ప్రభుత్వం', స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. వంద రోజుల పాలనలో చంద్రబాబు చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు ఆమె వివరించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా రాష్ట్రం అభివృద్ధికి ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని కోరుతూ చంద్రబాబు స్వర్ణాంధ్ర-2047 పేరుతో కార్యక్రమం చేపట్టారని, మీ విజన్.. మా మిషన్ నినాదంతో కలిసికట్టుగా రాష్ట్రాన్ని పునర్నిర్మిద్దామంటూ ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాంప్రసాద్, తెదేపా నాయకులు మానుకొండ శివప్రసాద్, ముత్తినేని రాజేష్, లంకా ఉదయ్‌కుమార్, పాకాలపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి

జగన్ ప్రకటించిన విరాళం అందజేయాలి

పట్టాభిపురం: వరద బాధితులకు అందజేస్తామని జగన్ ప్రకటించిన రూ.కోటి విరాళాన్ని అందజేయాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి హితవు పలికారు. ఇటీవల భారీ వర్షాలకు అడపా బజార్‌లో ఇంటి పైకప్పు కూలి సూరమ్మ మృతి చెందారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా రూ.5 లక్షలు పరిహారం ప్రకటించింది. ఈ చెక్కును మృతురాలి కుమారుడు శ్రీనివాసరావుకు ఎమ్మెల్యే మాధవి అందజేసి మాట్లాడుతూ బాధితులకు అండగా నిలబడడం చంద్రబాబు నైజమన్నారు. వరద బాధితులను ఆదుకోవడానికి జగన్‌తో పాటు వైకాపా నేతలకు చేతులు రావడం లేదని, విమర్శించడానికి మాత్రం నోళ్లు వస్తున్నాయని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో తెదేపా నాయకుడు ఉప్పుతల సాంబశివరావు పాల్గొన్నారు.



బాలు కాంస్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తూర్పు ఎమ్మెల్యే నసీర్ తదితరులు

ఎస్పీ బాలుకు కళాదర్బార్ నివాళి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: కళాదర్బార్-అమరావతి సంస్థ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు ఆధ్వర్యంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నాలుగో వర్ధంతి బుధవారం నిర్వహించారు. నాజ్ కూడలిలోని బాలు కాంస్య విగ్రహం వద్ద గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్, తదితరులు పాల్గొని పుష్పమాలలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం ఆర్చిడ్ హోటల్‌లో బాలు స్వర నిరాజనం పేరున సంగీత విభావరి జరిగింది. కార్యక్రమంలో బాలస్వామి, రాజశేఖర్, హనుమాన్‌సింగ్, వేణుగోపాలరావు, ధర్మసింగ్ తదితరులు పాల్గొన్నారు.

మధుబాబుకు ఎస్పీ బాలు స్మారక పురస్కారం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: అమరావతి రోడ్డు అన్నదాన సమాజ ఆడిటోరియంలో బుధవారం రాత్రి కళాంజలి సంస్థ ఆధ్వర్యంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా 'పల్లవించవా నా గొంతులో' పేరున కార్యక్రమం నిర్వహించారు. తొలుత సినీ సంగీత విభావరి నిర్వహించారు. రమేష్, వి.మధుబాబు, రాజేంద్రకుమార్, ఎ.సాంబశివరావు, అబ్దుల్ ఖాదర్, ఎస్.సాంబశివరావు, శివలీల, అన్నపూర్ణ పలు చలనచిత్ర గీతాలను ఆలపించారు. అనంతరం జరిగిన సభలో డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్మారక పురస్కారాన్ని గాయకుడు వెలిశల మధుబాబు దంపతులకు అందించారు. కార్యక్రమంలో గాదె రత్నారెడ్డి, నెల్లూరు కృష్ణారావు, దేవ సహాయన్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తొట్టెంపూడి రమేష్, కంచర్ల రాజేంద్ర కుమార్ సౌజన్యంతో కార్యక్రమాన్ని నిర్వహించారు.



మధుబాబు దంపతులకు పురస్కారం అందిస్తున్న జాస్తి వీరాంజనేయులు తదితరులు

మహిళాభ్యుదయానికి పోరాడిన కవి జాషువా

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: గుర్రం జాషువా మహిళాభ్యుదయం ఆశించిన కవి అని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని శ్రీశారదనికేతన్‌లో జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో 'జాషువా సాహిత్యంలో స్త్రీ' అనే అంశంపై బుధవారం సభ నిర్వహించారు. సభకు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ తెలుగు సాహితీ లోకంలో మహిళల అభ్యున్నతి కోసం మహాకవి జాషువా విస్తృతంగా రచనలు చేశారని తెలిపారు. సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలపై తన కలంతో పోరాడారని వివరించారు. సభలో జేకేసీ కళాశాల విశ్రాంత అధ్యాపకురాలు మట్టా విజయశ్రీని కళాశాల కరస్పాండెంట్ జి.శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.కోటిరత్నం, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంజేజేఎస్ అధ్యక్షుడు పినపాటి మోహన్ రావు, ప్రముఖ పద్య గాయకుడు ఎనుబరి చంద్రపాల్, భీంసేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం, బత్తుల కోటేశ్వరరావు, న్యాయవాది సంజీవరెడ్డి, చావలి బాలస్వామి, గాయకుడు పి.వి.రమణ, పునులూరి విజయ్ తదితరులు పాల్గొన్నారు.



విజయశ్రీని సన్మానిస్తున్న మాణిక్యవరప్రసాద్, లక్ష్మణరెడ్డి తదితరులు

విద్యార్థినికి బాసట


పట్టాభిపురం, న్యూస్‌టుడే: వరంగల్‌లోని కాకతీయ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన గాయత్రికి కమ్మజన సేవా సమితి కార్యదర్శి చుక్కపల్లి రమేష్ చొరవతో దాత మేకా హరిబాబు, మద్రిపూడి సీతారామయ్య, పెద్ది సాంబశివరావు, కట్టా శివాజీలు రూ.50 వేలు చెక్కు అందజేశారు.

ఫార్మసిస్టుల సేవలు కీలకం

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: రోగికి మందులు అందజేయడం మొదలుపెట్టినప్పటి నుంచి ఆ సమస్య పరిష్కారమయ్యే వరకూ ప్రతి దశలోనూ ఫార్మసిస్టుల పాత్ర కీలకమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి విజయలక్ష్మి తెలిపారు. ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవం సందర్భంగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏపీ ఫార్మసిస్టుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌వోతో పాటు పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ పీవో శ్రావణబాబు, డీఐవో సుబ్బరాజు, డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నపూర్ణ, పలువురు ఫార్మసిస్టులు పాల్గొన్నారు.



విజయలక్ష్మిని సన్మానిస్తున్న ఫార్మసిస్టులు



వరద బాధితులకు సాయం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: తెలుగు మహిళ నాయకురాలు ములకా సత్యవాణి ఆధ్వర్యంలో మారెళ్ల రామకృష్ణ, వెంకటరమణ వరద బాధితుల సహాయార్థం రూ.2 లక్షల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబుకు సచివాలయంలో బుధవారం అందజేశారు.

తప్పుల్ని కప్పి పుచ్చుకునేందుకు డ్రామా: మోహనకృష్ణ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: తిరుమలలో అయిదేళ్ల పాటు చేసిన తప్పుల్ని కప్పి పుచ్చుకునేందుకు జగన్ మరో డ్రామాకు తెర లేపారని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ విమర్శించారు. గుంటూరులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఈనెల 28న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో పూజలు చేయాలని జగన్ పిలుపు ఇవ్వడం విడ్డూరంగా ఉంది. జగన్ ఏ మతాన్ని ఆచరించినా, ఏ దేవుడ్ని పూజించినా.. హిందూ సంప్రదాయాన్ని గౌరవించాల్సిన బాధ్యత ఉంది. తితిదే బోర్డును రాజకీయ ఉపాధి కేంద్రంగా మార్చేశారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించేటప్పుడు సతీసమేతంగా వెళ్లడం సంప్రదాయం. ఆవిధంగా చేయకపోగా తితిదే సెట్టింగ్‌నే తాడేపల్లి ప్యాలెస్‌లో వేయించారు. ఇప్పటికైనా డ్రామాలు కట్టిపెట్టి సిట్ విచారణకు సహకరించి చేసిన తప్పులకు శిక్ష అనుభవించాలి'.. అని మోహనకృష్ణ హితవు పలికారు.

జగన్‌కు ఏ మతంపైనా విశ్వాసం లేదు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: జగన్‌కు అసలు ఏ మతంపైనా విశ్వాసం ఉండదని, కేవలం పదవి, డబ్బు కోసం అన్ని మతాలను వాడుకుంటారని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు విమర్శించారు. గుంటూరులో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'తితిదేని అన్యమతస్థులతో నింపి ఆచార, వ్యవహారాలను మంటకలిపారు. తిరుపతి లడ్డూలో జంతు సంబంధిత కొవ్వు కలిసిందని నిరూపిస్తే పవన్ కల్యాణ్ బూట్లు తుడుస్తానని అంబటి రాంబాబు మాట్లాడటం సిగ్గుచేటు. ల్యాబ్ పరీక్షల్లో ఈ విషయం తేలిందని గ్రహించాలి'.. అని పేర్కొన్నారు.

చిట్టీల డబ్బు ఎగ్గొట్టిన అయిదుగురిపై కేసు

పట్టాభిపురం: చిట్టీల డబ్బు ఎగ్గొట్టినందుకు అయిదుగురిపై అరండల్‌పేట ఠాణాలో కేసు నమోదైంది. చైతన్యపురి కాలనీకి చెందిన చంద్రావతి, భర్త సుబ్బారెడ్డి, కుమారుడు హర్షారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి స్థానికుల నుంచి పలు రకాల చిట్లు వేయించారు. చిట్టీ పాడిన సొమ్మును ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని, కనిపించకుండా వెళ్లిపోయారని నాగలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరికి రామకృష్ణారెడ్డి సహకరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈవిధంగా రూ.75 లక్షలు వరకు బాధితులకు ఎగ్గొట్టారని ప్రాథమికంగా తేల్చారు. ఇది ఇంకా పెరిగే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు.